28.10.1994 శుక్రవారం, 12 పేజీలు, సంపుటి: 66, సంచిక: 42, విడిప్రతి : రు. 2.00లు Phone : 27354 Regd. No. HNL. 18

జమీన్ రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

లిస్టులన్నీ పివి చెత్తబుట్టపాలే!

కాంగ్రెస్ టిక్కెట్ల వ్యవహారం ఢిల్లీకి మారింది. రాష్ట్ర నాయకులందరూ పోలోమని హస్తినకు పరుగెత్తి పోయారు. టిక్కెట్ల పైరవీకి ఎవ్వరూ ఢిల్లీకి రావద్దని కేంద్ర నాయకులు నెత్తినోరు బాదుకొని నచ్చ చెప్పినా ఎవ్వరూ చెవికెక్కించుకోలేదు. పిఇసి సమావేశం తర్వాత ఢిల్లీ విమానం టిక్కెట్లకు ఎంత రద్దీ ఏర్పడిందంటే- 26 తేది ఉదయం విమానానికి 350 మంది వెయిటింగ్ లిస్టులో ఎదురు చూస్తుండినారు. ఈ రద్దీ తట్టుకోవడానికి ఒక స్పెషల్ ఫ్లయిట్ వేయాలని ఇండియన్ ఎయిర్‌లైన్స్ తలపెట్టింది. కాని విమానాల మంత్రి శ్రీ గులామ్ నబీఆజాద్ ఈ సంగతి తెలుసుకుని, ఇప్పుడు ఢిల్లీలో వుండే వారితోనే మా తలబొప్పి కట్టిపోతున్నది. ఇంకా కొత్తవారినెందుకు మాపై తోలుతారు. స్పెషలూ వద్దు. గిషలూ వద్దు అని హుంకరించారట. పాపం ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు మంచి వ్యాపారం పోయింది. విమానంలో సీటు దొరికిన వారు ఆ నిజంగా పార్టీ టికెట్ లభించినంత సంబరపడిపోయారు. విమానమెక్కలేని వారివైపు దురదృష్టవంతులన్నట్లు జాలి చూపులు చూశారు. వింతగా, విచిత్రంగా వుండింది ఆ పరిస్థితి. ఈ సానుభూతి భరించలేక విమానం టిక్కెట్టే సంపాదించ లేనివాడివి అసెంబ్లీ టిక్కెట్ ఎట్లా పొందుతావనే వ్యాఖ్యలతో తమను అసమర్థులుగా పరిగణనిస్తున్నారన్న దిగులుతో కొందరు మద్రాసుకు వెళ్ళి, మరికొందరు బెంగుళూరు మీదుగా ఢిల్లీకి ఎగిరివెళ్లారు.



ఇంతకూ, ఇంత ఆరాటపడి, తపనపడి, తంటాలుపడి ఢిల్లీకి వెళ్లి వీరందరూ ఏమి చేస్తున్నట్లు? ఏమి చేయనున్నట్లు? నియోజక వర్గంలోని కార్యకర్తలు తమ నాయకుడూ ఢిల్లీకి వెళ్లాడని చెప్పుకోవడానికి తప్ప, నిజానికి ఈ అభ్యర్థులందరూ అక్కడ చేసే పని శూన్యం! ఒక్కరంటే ఒక్కరిని కూడా పివి తన దగ్గరకు రానివ్వడం లేదు; మాట్లాడడం లేదు;

> పిసిసి, పిఇసి, స్క్రీనింగ్ కమిటీ జాబితాలన్నిటినీ ప్రక్కనపెట్టి తన స్వంత పేర్లతో కొత్తలిస్టు రూపొందిస్తున్నారు ప్రధాన మంత్రి

అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు. పిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి పంటి

కొరవ 8 పేజీలో

కాంగ్రెస్‌కేదో శని పట్టినట్లుంది!

జిల్లాలో కాంగ్రెస్ టిక్కెట్ల పోరు రోజు రోజుకి శృతి మించి రాగాన పడుతున్నది. రోజులు గడిచే కొద్దీ ఒక్కొక్కరి రంగు పరమ వికృతంగా, వికారంగా బయట పడుతున్నది. పైకి చెప్పే దొకటి, లోపల చేసేదింకొకటి; పగలు తిరిగే దొకరితో, రాత్రి పవళించేది మరొకరితో; జుగుప్సా కరంగా, రోతగా, అసహ్యం పుట్టేటట్లుగా వున్నాయి జిల్లా నాయకుల పిట్ల కాటా కుస్తీలు.

వెంకటగిరిసీటు ప్రలోభానికిలోనై మేగోరెతో కలసి ఢిల్లీవెళ్ళాడు వేమారెడ్డి రామచంద్రారెడ్డి!

నెల్లూరులో ఎప్పుడూ లేదీ పరిస్థితి. కాంగ్రెస్ దురదృష్టం అది!

* * *

టిక్కెట్ ఆశిస్తున్న వారంతా ఢిల్లీలో మకాం పెట్టి వున్నారు. పివి శేషారెడ్డి వంటి ఒకరిద్దరు తప్ప నెల్లూరులో ఎవరూ లేరు. ఢిల్లీలో వీళ్ళేమి చేస్తారో, ఎవరితో మాట్లాడుతారో మనకైతే తెలియదు కాని, అదేదో వీధి కొల్లబోయినట్లు పరుగెత్తుకొని వెళ్లారు అందరూ! టిక్కెట్ల ప్రకటన వెలువడే వరకు ఎవరూ తిరిగి వచ్చేట్లు లేరు. ఒక్కసారిగా రాజకీయ వాదుల పాపభారం తనపై నుంచి లగి నందువల్ల కాబోలు, మిడిసి కాస్తుండిన ఎండలను ఉపశమింపజేసి, సుదీర్ఘంగా మూడు రోజుల నుంచి జిల్లా అంతా వానలు కురిపిస్తున్నది ప్రకృతి మాత. ఆమె ఎంత ఉపశమనం భావించనిదే ఇంతలో ఇంత మార్పు వస్తుంది చెప్పండి!

* * *

టిక్కెట్ల పంపకం విషయం ఇప్పటికీ ఏమీ తేలలేదు. పార్టీ మాత్రం నిలువునా రెండుగా చీలి పోయింది. మాగుంట సుబ్బరామ రెడ్డి గారు జనార్దన రెడ్డి వ్యతిరేకులం దరినీ ఒకే గాట కట్టేయడంలో కృతకృత్యులైనారు. వదలితే మళ్ళీ పారిపోతారని కాబోలు సందాని భాషా నుంచి జెకె రెడ్డి వరకు; రావుల అంకయ్య గౌడ్ నుంచి వేమారెడ్డి రామచంద్రా రెడ్డి వరకు అందర్నీ కలిసి, ఢిల్లీలోని తన బంగళాలో కుక్కి వున్నారు. పెళ్లకూరుకు మినహా అందరికీ అదే అతిథి గృహం; వంటా, వార్పు, వడ్డనలూ అక్కడే! విందు భోజనాలు ఆరగిస్తూ, హాయిగా విశ్రాంతి తీసు కుంటున్నా రందరూ!

సుబ్బరామ రెడ్డి గారు తన వర్గం జాబితాను 26 తేది రాత్రి ప్రధాని శ్రీ పి.వి. నరసింహా రావుకు సమర్పించి వచ్చారట. నెల్లూరులోని 11 సీట్లతో పాటు, ఇరుగు పొరుగు జిల్లాలలోని మరొక పది సీట్లు తనకు అప్ప చెప్తే అందరి ఖర్చూ తానే భరించి, గెల్పించుకొని వస్తానని ప్రధానికి విన్నవించారట. తన అభ్యర్థులుగా ఆయన ప్రతిపాదించిన పేర్లు విస్మయకరంగా, విచిత్రంగా వున్నాయి. నెల్లూరుకు పివి ప్రసన్న రెడ్డి, కోవూరుకు బెజవాడ సురేష్ రెడ్డి, అల్లూరుకు పెళ్ళకూరు ప్రభాకర రెడ్డి, కావలికి ఎన్ఎల్ నరసింహా రావు, ఆత్మకూరుకు మాదాసు గంగాధరం, రాపూరులో అంకయ్య గౌడ్, వెంకటగిరికి వేమారెడ్డి రామచంద్రా రెడ్డి, ఉదయగిరికి మాదాల జానకి రాం సూళ్లూరుపేటకు పూలుకూరు ఆదిమూర్తి, గూడూరులో ఓడూరు

అసెంబ్లీ సీట్ల ఆరాటంలో పార్టీలో నిట్ట నిలువు చీలిక!

రామచంద్ర రావు, సర్వేపల్లికి జెకె రెడ్డి పేర్లను ప్రతిపాదించారు మాగుంట సుబ్బరామిరెడ్డి.

ఆయన జాబితా ఆమోదింప బడితే సిటింగ్ ఎమ్మెల్యే లందరూ ఇళ్లకు వెళ్లవలసిందే. జనార్దన రెడ్డి పైకి వేమారెడ్డి రామచంద్రా రెడ్డిని ఎగద్రోలి, వెంకటగిరికే ఎసరు పెట్టించడం ఒక విచిత్ర పరిణామమైతే, ఇంత కాలం తననే నమ్ముకొని, తన వర్గంగా చలామణి అయిన మంత్రి కలికి యానాది రెడ్డి, అల్లూరు విష్ణువర్ధన రెడ్డిలకు సైతం గొంతు కోయడానికి ఉద్యుక్తులు కావడం ఇంకా విస్మయం కల్గిస్తున్నది;

పివి తనమాటే వింటాడని, తాను చెప్పిన వారికే సీట్లు ఇస్తాడని చాలా నమ్మకంగా వున్నారు సుబ్బరామరెడ్డిగారు. ప్రధానికి జామిస్పటికి పదిహేనుకోట్ల వరకు ముడుపులు చెల్లించివున్నామని; తమను నిరాకరించే నైతిక స్థైర్యం ఆయనకు లేదని తమ అనుచరులకు ధైర్యం చెప్తున్నారు.

జనార్దనరెడ్డి సహజంగానే నోరు మెదపడం లేదు. టిక్కెట్ల సాధనలో తనవ్యూహం ఏమిటో, ప్రణాళిక ఏమిటో, తన అభ్యర్థులెవరూ బయట పెట్టడం లేదు. ఆయనిప్పటివరకు ప్రధానిని కూడా కలసినట్లు లేదు. తనకెంతో ఆప్తుడు, స్నేహితుడు అయిన వేమారెడ్డి రామచంద్రారెడ్డిని సైతం ప్రలోభపరచి తమ శిబిరంలో కట్టేసుకోవడంతోపాటు, ఏకంగా తన సీటుకే ఎసరు పెట్టడానికి యత్నిస్తున్నారని తెలిసినా మాగుంట వారిని పల్లెత్తుమాట అనడం లేదు. నిర్వికారుడైన వేదాంతివలె జరుగుతున్నదంతా చూస్తూ వుండిపోతున్నాడు. జనార్దనరెడ్డికిది మామూలే. నోరు మెదపకుండా, నొక్కాల్సిన దగ్గర నొక్కి అనుకున్నది సాధించుకోగల చాతుర్యం ఆయనకుంది.

ఈ రెండు వర్గాలూ కాకుండా తమతమ స్వంత ప్రయత్నాలలో రాజమోహన్‌రెడ్డి, గ్రిద్దలూరు సుందరరామయ్య, పూసల రంగయ్య, ఎల్‌వి కృష్ణారెడ్డి, పెళ్లకూరు వసంతకుమార్‌రెడ్డి వగైరాలు తలమునకలుగా వున్నారు.

* * *

ఏ ఏ స్థానానికి ఎవరెవరికి అవకాశం వుంటుంది అన్న ప్రశ్నకు సమాధానం చెప్పడం సాహసంగా కన్పిస్తున్నది. పివి సంగతి తెలిసీ- ఎవరెవరికి సీట్లు ఇవ్వబోతున్నాడో వూహించడం ఎట్లా?

నెల్లూరులో తనకు టికెట్ ఖరారైందని ధైర్యంగా ప్రకటించుకున్నారు శ్రీ పివి ప్రసన్నరెడ్డి. ఆయన నమ్మకానికి ఆధారమేమిటో తెలియదు. సుబ్బరామరెడ్డి గారు ఇతర ఏ సీట్లు ఎటు పోయినా, ఈ ఒక్క సీటుపై పట్టుపట్టి సాధించుకొని వస్తారనే నమ్మకం కావచ్చు. కాని ఇంతదా[illegible] వచ్చిన తర్వాత జనార్దనరెడ్డి ఈ [illegible] విషయంలో సందు వదులుతా[illegible] ప్రసన్నరెడ్డికి సీటు వస్తే వ్యక్తిగతం[illegible] మాగుంట వర్గం తనపై ఆధి[illegible] నిరూపించు కున్నట్లవుతు[illegible] అందువల్ల కడవరకు ఆయన [illegible]

ప్రధానికి పదిహేను కోట్ల ముడుపు చెల్లించాము కాబట్టీ తమ జాబితాను కాదనలేడని మాగుంటధీమా; 25 సీట్ల వరకు మొత్తం ఖర్చు తామే భరిస్తామని ఢిల్లీలో వాగ్దానం!

విషయమై పోరాటం జరపక తప్పదు.

జనార్దనరెడ్డి అభ్యర్థిగా ఎవరుంటారు? ఆయనైతే చెప్పడం లేదు. కాని పరిస్థితులనుబట్టి అర్థం చేసుకోగల్గితే చేవూరు దేవకుమార్‌రెడ్డికి ఆ అవకాశం కల్గాలి.

రఘునాథరెడ్డి అభ్యర్థిగా శ్రీ ఎల్‌వి కృష్ణారెడ్డి, ముద్రగడ పద్మనాభం క్యాండిడేట్‌గా పసుపులేటి విజయకుమార్, పివి స్వంత ఆశీర్వాదం లభిస్తుందనే ఆశతో పెళ్లకూరు వసంతకుమార్‌రెడ్డి కూడా రంగంలో వున్నారు. ఎవరి ప్రయత్నాలు వారివి. బిసిలకు అవకాశం ఇస్తే విజయకుమార్‌కు ఛాన్సు తగులు తుందా?

కొరవ 7 పేజీలో

అయోధ్య తీర్పు

అయోధ్య వివాదం విషయంలో తన అభిప్రాయం వ్యక్తం చేయడానికి నిరాకరించి సుప్రీంకోర్టు హుందాగా వ్యవహరించింది. పదవీ విరమణకు ఒక రోజుముందు ఈ తీర్పు ప్రకటించి న్యాయస్థానం పరువు ప్రతిష్ఠలను పెంచివెళ్లారు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య.

అయోధ్యలోని బాబ్రీ మసీదును బిజెపి కూలగొట్టిన తర్వాత, తిరిగి అక్కడ రామాలయం నిర్మించాలా లేక మసీదును పునర్నిర్మించాలా అన్న ప్రమాదకరమైన వివాదాన్ని పరిష్కరించే బాధ్యతనుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. బాబ్రీమసీదుకు పూర్వం అక్కడసలు రామాలయం వుండిందీ, లేనిదీ నిర్ధారించవలసిందిగా కోర్టును కోరారు. నాలుగు వందలేళ్లనాడు అక్కడ ఏ కట్టడం వున్నది సుప్రీంకోర్టు తేల్చిచెప్తే ఈ సున్నితమైన వివాదం నుంచి తాను తెలివిగా తప్పించుకోవచ్చుననీ; నెపం కోర్టుపైకి త్రోసివేసి నిర్ణయం తీసుకోవచ్చునని కేంద్రం తెలివిగా ఆలోచించింది. కాని సుప్రీంకోర్టు అంతకంటే మించిన విజ్ఞతతో వ్యవహరించింది. ఇది తమకు నిమిత్తంలేని వివాదమని, తాము అభిప్రాయం చెప్పవలసిన అవసరం లేదని స్పష్టంగా ప్రకటించారు న్యాయమూర్తులు.

అదే సమయంలో మసీదు కూల్చివేసి తాత్కాలిక రామాలయం నిర్మాణం అనుమతించినందుకు ఆనాటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కళ్యాణసింగ్‌కు సుప్రీంకోర్టు ఒక రోజు జైలుశిక్ష విధించింది. ఈ వివాదాస్పద స్థలం విషయంలో అలహాబాద్ హైకోర్టులో పెండింగ్‌లో వున్న భూయాజమాన్య హక్కు కేసు తీర్పును పాటించమని కేంద్రాన్ని ఆదేశించింది.

సుప్రీం కోర్టు తిరస్కారం వల్ల కేంద్రం ఇప్పుడు అయోధ్య విషయంలో తక్షణ నిర్ణయం తీసుకోవలసిన అవసరం లేకుండా తప్పించుకోగల్గింది. నాలుగు వందలేళ్ల క్రితం అక్కడ రామాలయం వున్నట్లు నిర్ధారించినా, లేదని తేల్చి చెప్పివుండినా ప్రభుత్వం ఇరకాటంలో పడివుండేది. ఆలయ భూమి యాజమాన్యపు హక్కు కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పేవరకు సమస్యను వాయిదావేసి, ఈలోగా ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వక పరిష్కారం కోసం చర్చలు పునఃప్రారంభించే సావకాశం లభించడానికి కేంద్రానికిది వెసులుబాటు. అదే సమయంలో ఆలయం పరిసరాలలోని ఇతర భూమి సేకరణ కుద్దేశించిన అయోధ్య చట్టం సరైనదని సుప్రీంకోర్టు చెప్పడం వల్ల శంకరాచార్యులు తలపెట్టిన ట్రస్టుకు దాన్ని స్వాధీనం చేసే స్వేచ్ఛ కూడా కేంద్రానికి లభించింది. మసీదు వుండిన రెండున్నరెకరాల భూమిని మినహాయించి మిగతా స్థలాన్ని ట్రస్టుకు అప్పచెప్పవచ్చు. బాబ్రీమసీదుకు మహమ్మదీయ చట్టం ప్రకారం ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడం తగదని, భారత రాజ్యాంగానికి లోబడి దానిని ఒక ప్రార్థనా [illegible] మాత్రమే పరిగణించాలని [illegible] తీర్పు చెప్పింది.

అత్యంత వివాదాస్పదము, సంక్లిష్టము, సున్నితము, భావోద్రేకాల ప్రేరేపణకు అవకాశము కల్గిన సమస్య పట్ల సుప్రీంకోర్టు అన్ని కోణాలనుంచి ఆలోచించి సమగ్రమైన అభిప్రాయం వ్యక్తం చేయడం హర్షదాయకం. అందువల్లనే బిజెపితో సహా అన్ని రాజకీయ పార్టీలూ ఈ తీర్పును స్వాగతించాయి.

అయితే రాజకీయంగా అయోధ్య సమస్యను తమకనుకూలంగా మల్చుకోవడానికి బిజెపి మరొకసారి ప్రయత్నించే అవకాశం వుంది. సుప్రీంకోర్టు జోక్యం లేదుకాబట్టి రామాలయం నిర్మాణం తలపెట్టాలని కేంద్రంపై వత్తిడి తెచ్చి, 1992 లో వలె మరొక సారి అయోధ్యను ముట్టడించడానికి వారు ప్రయత్నించవచ్చు. కనీసం ఉత్తర ప్రదేశ్ వరకైనా ఇది వారికి ఓటర్లను ఆకర్షించడానికి పనికి వస్తుంది. అయితే సెక్యులర్ రాజ్యాంగ ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యతను నిర్వహించడంలో విఫలమైన కళ్యాణసింగ్‌ను శిక్షించడం ద్వారా సుప్రీంకోర్టు మరొకసారి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరించజాలవని హెచ్చరించింది. ఆ హెచ్చరికను గుర్తు పెట్టుకొని సమర్థవంతంగా వ్యవహరించి బిజెపి, విశ్వహిందూ పరిషత్ కుట్రలనుంచి పవిత్ర స్థలాన్ని కాపాడవలసిన బాధ్యత రెండు ప్రభుత్వాలకూ వుంది. బిజెపి సైతం ఎప్పటి కప్పుడు నిప్పు ఎగద్రోసి రావణకాష్టాన్ని ఎప్పుడూ మండించివుంచే యత్నం చేయకుండా జాతీయ ప్రయోజనాల దృష్ట్యా విశాల దృక్పథంతో వ్యవహరించడం అవసరం.

రామాలయం నిర్మాణం నలుగురు శంకరాచార్యులు కలసి రూపొందించిన ట్రస్టుకు అప్పచెప్పే ఆలోచన పివికి ఉన్నట్లు సూచనలందుతున్నాయి. శంకరాచార్యులు రాజకీయాలకు అతీతులు. విశ్వహిందూ పరిషత్ వంటి మతోన్మాద శక్తులను దూరంగా పెట్టి, హిందూమత ఔన్నత్య పరిరక్షణకు కృషి చేయగల మహర్షులు వారు. నిర్మాణం జరిగితే ఉభయ మతాలకూ ఆమోదయోగ్యమైన పరిష్కారం సాధించే వీలు వుంది. సుప్రీం కోర్టు తీర్పుద్వారా లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని పక్షాలవారూ ఈ రావణకాష్టాన్ని చల్లార్చాలి.

జమీన్‌రైతు
27-10-1944
పేజీలు : 8 వెల : 0-1-6

50 ఏళ్లక్రితం ఈవారం

మద్రాసు ఒక చోరీకేసులో దొడ్లరాఘవరెడ్డిగారి అరెస్టు-బెయిల్‌మీద విడుదల

మద్రాసు 26తేది-

మద్రాసులో మార్డర్‌కేఫ్ ప్రొప్రయిటరు శీతారామారావు గారింటిలో 5-10-44తేది రాత్రి షుమారు 7వేల రూపాయల వెలగల నగలు, చీరెలు వగయిరాలు చోరీ పోయినవి.

ఈ సందర్భంలో వారింటి నౌకరీ 'రామ' అనే అతన్నిన్నీ, కార్పొరేషన్ నౌకరు కుమారస్వామినిన్నీ అరెస్టుచేశారు. మరిన్నీ బుచ్చిరెడ్డిపాళెం దొడ్ల వరదారెడ్డిగారి తమ్ముడున్నూ, కడప జిల్లా బోర్డు ప్రెసిడెంటుగారి కుమార్తె భర్తయున్నూ, అనగా బెజవాడ రామచంద్రారెడ్డిగారి అవిభక్త కుటుంబీకుడున్నూ అయిన దొడ్ల రాఘవరెడ్డిగారిని గూడ 14తేది అరెస్టు చేశారు. ఈ దొడ్లవారింటిలో సదరు చోరీనగలు వగయిరాలుండిన ట్రంకుపెట్టె మాత్రం దొరికినదట. దొడ్లావారి వంటవాడు కొడవలూరు వాస్తవ్యుడు బిస్త శంకరుడనేవాడు ఈ మధ్య పరారీ అయివుంటే అతన్నిగూడా రెండు మూడు రోజుల క్రిందట కొడవలూరులో అరెస్టుచేసి మద్రాసుకు తీసుకపోయినారు; [illegible]వారి బంగళా ఎగ్మూరు టవర్[illegible]కి ఉత్తరంగా పరశువాకంపాయ్యో[illegible]స్టులో వుంది. శీతారామారావుగారి యిల్లు పరుశువాకం బస్‌స్టాండుకు ఒక ఫర్లాంగు దక్షిణంగా వుంది. దొడ్ల వారి బంగళాకు శీతారామరావుగారి యింటికి షుమారు 4 ఫర్లాంగులు వుంటుంది. శీతారామరావుగారి నౌకరుకు, ఈ దొడ్లవారి వంటవాడికి సంబంధాలున్నట్లు విచారణలో తెలుస్తున్నది. ఈ సందర్భంతో సదరు దొడ్ల రాఘవరెడ్డిగారు, విల్లుపురంలోవుండే తన కుమార్తెకు వ్రాసిన రెండు మూడు ఉత్తరాలుగూడ పోలీసులు అక్కడపట్టుపరచుకున్నట్లు తెలుస్తుంది. కేసు పోలీసు దర్యాప్తులో వుంది. నెల్లూరులో డిప్టీ సూపరెంటుగా వుండిపోయిన పాత్రోగారు నేడు మద్రాసులో అసిస్టెంటు పోలీసు కమీషనరుగావున్నారు. ఈ కేసు వారి పర్యవేక్షణక్రింద జరుగుచున్నది. ఇంకా చార్జిషీటు పెట్టలేదు.

-మా ప్రత్యేకవిలేఖరి.

నెల్లూరు ముచ్చట్లు
మళ్ళీపెళ్ళి

మన దువ్వూరు నారాయణరెడ్డిగారి పినతల్లి కుమారుడైన దువ్వూరు వెంకటకృష్ణారెడ్డిగారు ప్రథమ భార్యకు సంతానంలేదన్న బెంగతో 21తేది

కొరవ 10 పేజీలో

కళ్యాణరావుస్మృతిగా పార్టీభవనం-జనార్దనరెడ్డికాంగ్రెస్‌భక్తినిరుపమానం!

నెల్లూరు పట్టణ నడిబొడ్డులో 50 సంవత్సరాల క్రితమే కాంగ్రెస్ భవనం నిర్మించ తలపెట్టినా, పునాదుల వరకే పరిమితమై పశువుల కొట్టంగా తయారై వుండింది. అటువంటి దానిని నేదురుమల్లి జనార్దనరెడ్డి తాను అధికారంలో లేనప్పుడు స్వయంగా పూనుకొని, వ్యయ ప్రయాసలతో సుందరమైన భవనాన్ని నిర్మించి 'ఇందిరాభవన్'గా నామకరణం చేసి, తన శక్తి సామర్థ్యాలను, పార్టీపై తనకున్న అంకితభావాన్ని నిరూపించుకున్నారు. ఇప్పుడు మళ్ళీ వెంకటగిరిలో స్వాతంత్ర్య సమరయోధుడు త్యాగమూర్తి అయిన స్వర్గీయ కటికనేని కళ్యాణరావు గారి ఇంటిని స్వయంగా కొని, కాంగ్రెస్ ఆఫీసుగా మార్చారు. దానికి కటికనేని కళ్యాణరావు భవన్‌గా నామకరణంచేసి కొత్త తరం మరిచి పోయిన పాతతరం నాయకుడ్ని మళ్లీ ప్రజల ముందుకు తెచ్చిన జనార్దనరెడ్డి అభినందనీయులు.

నెల్లూరు -ఎ.శ్రీరాములు.

జనవాణి

మురికిలో మునిగి తేలుతున్న నెల్లూరు

జనాభా విషయంలో దినదినాభివృద్ధి చెందుతున్న నెల్లూరు పట్టణం సౌకర్యాల విషయంలో దిగజారి దీనావస్థలో వుంది. ముఖ్యంగా పరిశుభ్రత విషయంలో పురజనులు పడే ఇబ్బందులు చెప్పనలవి కావు. కొత్తగా డ్రైనేజి వ్యవస్థకు రూపకల్పన చేస్తున్న మహానుభావులను పదికాలాల పాటు తలచుకోవాలి. రెండు చినుకులు రాలితే చాలు ఎం.వి. అగ్రహారం, సాయిబాబా ఆలయం రోడ్లలోని మురికి కాలువలు పొంగి పొర్లి ట్రంకురోడ్డును ముంచెత్తుతాయి. పొగతోట, గాంధీనగర్, పాతస్టేషన్ అండర్‌బ్రిడ్జి, స్టోన్‌హౌస్‌పేట బ్రిడ్జి, ఎసినగర్, దక్షిణ బాలాజీనగర్ ప్రాంతాల భూమార్గాలు మూసుకపోయి పడవలు, లాంచీలు [illegible] పరిస్థితి నెలకొంటున్నది. కామాటి వీధి, జండావీధి, కూరగాయల మార్కెట్ ప్రాంతాల నుండి కుళ్ళిన కూరగాయలుతో జల ప్రవాహంలో తేలియాడుతూ వస్తుంటాయి. రాజకీయ వుత్సవాలకు, దసరా, వినాయక చవితి అలంకరణలకు త్రవ్విన గుంటలలో తెలియక జారిపడే వారిని లెక్కపెట్టలేము. టౌన్‌లోని ప్రధాన వీధులే ఈవిధంగా ఏడుస్తుంటే ఇక సందులు గొందులు మురికి సామ్రాజ్యాలుగా వెలుగొందుతున్నాయి. రోగాలకు సహకారులైన దోమల వుత్పత్తి కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. రాజకీయంగా, పారిశ్రామికంగా మహోన్నత స్థాయిలో

కొరవ 10 పేజీలో

సోమశిల పుణ్యం

చినుకు వాన పడకున్నా చెరువులన్నీ ఫుల్!

అక్టోబర్ 15 తేదీ నాటికి సోమశిల రిజర్వాయరులో 21 టి.ఎం.సి.ల నీరు నిల్వ వుండటం వల్ల పెన్నార్ డెల్టా, కనుపూరు కాల్వ క్రింది చెరువులకు పుష్కలంగా నీరు సరఫరా చేస్తారు. రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో గత మూడు నెలలుగా వర్షాలు లేకపోయినా కర్నూల్ జిల్లా కుందునది పరీవాహక ప్రాంతంలో పడ్డ భారీ వర్షాల వల్ల 17 టి.ఎం.సి.ల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ ఎస్.ఇ. రాఘవేంద్ర రావు చెప్పారు. చెరువు లన్నింటిని ముప్పాతిక వంతు నీటితో నింపుతామని. నాట్లు వేసుకోవడానికి రైతులకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే దగ్గరలో వున్న అసిస్టెంట్ ఇంజనీర్ దృష్టికి తీసుకు వెళ్లమని కోరుతున్నారు.

విలువిద్యా ప్రదర్శన

చతుష్షష్టి కళలలో ఒకటైన విలు విద్యా ప్రదర్శనను వర్థమాన సమాజం టౌన్ హాలులో నవంబర్ 1 తేదీ ప్రయోగాత్మకంగా ఏర్పాటు

నెల్లూరు సంగతులు

చేస్తుంది. నరసారావు పేటకు చెందిన అభినవ కిరీటి బిరుదాంకితుడు మిన్నికంటి వెంకటేశ్వర్లు ధనుర్విద్యలోని 12 ప్రక్రియలను ప్రదర్శిస్తారు. కార్యక్రమం ఎప్పటిలా కాకుండా సాయంత్రం 4.30 గంటలకే ప్రారంభ మవుతుంది. డాక్టర్ బెజవాడ గోపాల్ రెడ్డి దీన్ని ప్రారంభిస్తారు. రొటేరియన్ జె.ఎ. రెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ కార్యక్రమంలో ఈ అద్భుత విలుకాడ్ని అగస్త్యరెడ్డి వెంకురెడ్డి పరిచయం గావిస్తారని సమాజం కార్యదర్శి టి.వి. నరసింహాలు తెలియ జేస్తున్నారు. పుర ప్రజలందరూ మిస్ కాకుండా చూడ వలసిన కార్యక్రమం ఇది.

సిద్దార్థ ఆర్ట్స్ అకాడమీ సన్మానం

నెల్లూరు సిద్దార్థ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు జట్ నవనాథ రావు తాను రచించిన 'కీచకపర్వం' నాటకాన్ని తన దర్శకత్వంలో ఇటీవల టౌన్‌హాల్‌లో అందరి మెప్పు పొందేట్లు

కొరవ 11 పేజీలో

మానవులకు ముక్తి మార్గాన్ని బోధించే మహత్తర ఉపదేశం భగవద్గీత

భగవద్గీత గ్రంథం వేదముల వలె రాజాజ్ఞక గాను, పురాణముల వలె మిత్ర వాక్యంగాను, కావ్యముల వలె కాంతా సమ్మితం గాను మానవ జాతికి ముక్తి మార్గాన్ని, కర్తవ్యాన్ని బోధిస్తుంది. గానం చేయడానికి వీలుగా చక్కని శ్లోకాలలో శ్రీ కృష్ణుడు అర్జునునకు వుపదేశించి నందువల్ల పండిత పామరులకు దీని పఠన యోగ్యత కల్గినట్లు 20 తేది టౌన్ హాల్ రీడింగ్ రూమ్‌లో జరిగిన శంకర భారతి గ్రంథావిష్కరణ సభకు అధ్యక్షత వహించిన అరవత్తూర్ విశ్వనాథ శ్రౌతులన్నారు. అనేక ధార్మిక గ్రంథాలు రచించిన రిటైర్డ్ వి.ఆర్. కాలేజి ఆంధ్రోపన్యాసకులు శ్రీ పోలూరు హనుమజ్జానకిరామ శర్మ 71వ జన్మదినాన్ని పురస్కరించుకొని సాహిత్య సదస్సు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. శ్రీ శర్మ వద్ద ఆధ్యాత్మిక విద్యా రహస్యాలను అధ్యయనం చేసిన పండితులు. ఆకాశవాణి వుపన్యాసకులు తంగిరాల వెంకట సుబ్బయ్య తాను భగవద్గీతలోని 9, 11, 15 అధ్యాయాలను ఆదిశంకరుల వ్యాఖ్య ఆధారంతో పరమార్థ తత్త్వ విచారం గావిస్తూ శంకర భారతి గ్రంథాన్ని రచించి, తన గురువులకు కృతి సమర్పణ చేసినట్లు చెప్పారు.

వేద సంస్కృత కళాశాల వ్యాకరణా చార్యులు చింతలపాటి పూర్ణానంద శాస్త్రి గ్రంథ పరిచయం చేశారు. అధ్యాత్మిక విద్యా సారంతో నిండిన ప్రముఖ అధ్యాయాలను చదువరులకు వీలు కలిగించే విధంగా రచయిత వ్రాసినట్లు వివరించారు. రాజ విద్యగా పేర్గాంచిన ఆధ్యాత్మిక విద్యను క్షేత్రజ్ఞుడైన మానవుడు సులభంగా తెలుసు కొనేందుకు ఈ గ్రంథం చక్కగా వుపయోగ పడుతుందన్నారు. సాహిత్య సదస్సు గౌరవాధ్యక్షులు కురువాడ సత్యనారాయణ, ఎస్.వి. నరసింహా రావు, చతుర్వేదుల శ్రీరామమూర్తి, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి, సిసి సుబ్బరాయుడు కృతి భర్తను, కృతి కర్తను సత్కరించారు. సభారంభంలో సాహిత్య సదస్సు వ్యవస్థాపకాధ్యక్షులు గోసుకొండ వెంకట సుబ్బయ్య స్వాగతం పలుకగా, అవధానం సుబ్బు నరసయ్య వేద మంత్రోచ్ఛారణం గావించారు. కార్యదర్శి స్వయంపాకుల శ్రీనివాస రావు ఉపన్యాసకులను, అధ్యక్షులను పట్టు శాల్వలతో సన్మానించి కృతజ్ఞతాభి వందనాలు చెల్లించారు.

సణుగుడు

* సీట్లకోసం స్నేహానికి ద్రోహం

రాజకీయాలలో శాశ్వత శత్రుత్వాలు, స్నేహితాలు వుండవన్నది చాణుక్యుడి కాలం నుంచి వినవస్తున్న నానుడి; అధికారం కోసం నమ్మిన వాడిని, నమ్ముకొన్న వాడిని నిలువునా గొంతు తెగనరకడం కూడా, చాణుక్యుడు ఉపదేశించిన రాజనీతే! జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ఇప్పుడీ కౌటిల్య ధర్మాన్ని మనసా వాచా కర్మణా అనుసరిస్తున్నారు; ఆచరిస్తున్నారు.

ఫ్యూడల్ శక్తుల ప్రాబల్యం పెరిగితే కాంగ్రెస్‌పార్టీ సామాన్యుల నుంచి దూరమై పోతుందని రెండు నెలల క్రితం జమీన్‌రైతులో వ్యాఖ్య చేస్తే పొడుగు కార్ల పెద్ద రెడ్లందరూ నాలుక పెరికేసుకున్నారు; పేటంచు పంచల పెత్తం దార్లందరూ బీపీలు పెంచుకున్నారు. కాని ఇప్పుడు వీరి ప్రాబల్యం వల్ల పార్టీ సామాన్యులకు దూరం కావడమొక్కటే కాదు, వ్యక్తిగత స్నేహ ధర్మాలు, కనీస పాటి నైతిక విలువలు కూడా మంట గలిసి పోతున్నాయి.

తన అభ్యర్థులకు అసెంబ్లీ టిక్కట్లు తెచ్చుకోవడం ద్వారా జిల్లాలో తానే పలుకుబడి కల్గిన నాయకుడ్నని నిరూపించు కోవడానికి శ్రీ మాగుంట సుబ్బరామ రెడ్డి పడ్తున్న తాపత్రయం, అనుసరిస్తున్న మార్గాలు చూస్తుంటే విచారం కల్గుతున్నది. జిల్లా నాయకత్వం కోసం ప్రయత్నించడం తప్పు కాదు; జిల్లా నాయకత్వం ఎవరి తాత సొత్తూ కాదు. ఆశ, అవకాశం కల్గిన వారెవరైనా అందుకోసం ప్రయత్నించ వచ్చు; కృషితో సాధించు కోవచ్చు; సమర్థతతో నిలబెట్టు కోవచ్చు. కాని మాగుంట కుటుంబీకులు అందు కనుసరిస్తున్న పద్ధతులు, మార్గాలు, వ్యూహాలు నగటు కాంగ్రెస్ వాదులను కలత బెదుతున్నాయి.

తానిటీవల నెల్లూరులో జరిపిన జగదీశ్ టైట్లర్ సభకు హాజరు కాని వారందరినీ రాజకీయంగా అణగ ద్రొక్కి పారేస్తానని భీషణ ప్రతిజ్ఞ చేస్తున్నారు సుబ్బరామ రెడ్డి గారు. వినడానికే వెగటుగా వుంది వాచాలత్వం. సుబ్బరామ రెడ్డి గారు రాజకీయాలకు కొత్త. పురుడు పోసుకొని మూడేళ్ళు కూడా కాలేదు. ఈ వ్యవధిలో కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన మేలు అంటూ కూడా ఏమీ లేదు. తక్కిన నాయకులందరూ ఆయన కంటే ఎంతో ముందు నుంచి పార్టీలో వున్నారు. అధికారంలో వున్నా లేకున్నా పార్టీని అంటి పెట్టుకొని వున్నారు. ఎవరికి తగిన స్థాయిలో వారికి ప్రజాదరణ వుంది; అనుచరులున్నారు; రాజకీయాను భవం వుంది. తెలుగుదేశం అధికారంలో వున్న ఏడేళ్ళలో కూడా సుబ్బరామ రెడ్డి గారి వంటి సంపన్నులు ఎన్టీఆర్ ఇంటి చుట్టూ ప్రదక్షిణాలు చేసి, వ్యాపార లాభాలు పెంచుకొంటూ గడిపారు తప్ప. ఇప్పుడు జిల్లా పార్టీలో వున్న

డోలేంద్ర

ఏ చిన్నా, పెద్ద నాయకుడు కూడా అధికారం కోసం ఏ తెలుగు నాయకుడి గడప తొక్కలేదు; ఎన్టీఆర్‌కు సాగిలపడి మ్రొక్కలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సందు చూసి దూరిన వారెవరూ జిల్లాలో లేరు. చెప్పాలంటే సుబ్బరామ రెడ్డి గారే పార్టీకి కొత్త; పదవులకు కొత్త; ప్రజలకు కొత్త; పోరాటాలకు కొత్త. రాజకీయాలలో ఆయనకున్న ఒకే ఒక అర్హత డబ్బు. ఆ డబ్బు ఒక్క కాంగ్రెస్ పార్టీకే కాదు - అన్ని పార్టీలకూ వుపయోగ పడింది; పడుతున్నది ఏడేళ్ల పరిపాలనలో ఎన్టీఆర్ నెల్లూరు వచ్చినప్పుడల్లా మాగుంట డబ్బుతోనే జెండాలు కట్టారు. స్వాగత తోరణాలు అలంకరించారు.

కొరవ 7 పేజీలో

నెల్లూరు రచ్చల్లో విమర్శకుడు

వెంకయ్య నాయుడు గారికి అనారోగ్యం

బిజెపి అఖిల భారత ప్రధాన కార్యదర్శి, శ్రీ ఎం. వెంకయ్య నాయుడు ఏదో పని మీద బెంగుళూరు వెళ్లి అనారోగ్యం పాలైనారు. వాంతులు, విరోచనాలతో ఆస్పత్రిలో చేరవలసి వచ్చింది. ఇప్పుడు కోలుకున్నారు. హైదరాబాదుకు తిరిగి వచ్చేశారు. ఆయన త్వరలో సంపూర్ణారోగ్యవంతుడు కావాలని మా ఆకాంక్ష.

రాజకీయ వాదికి స్వంత ఆరోగ్యం కంటే పార్టీ హెల్త్ ముఖ్యం కదా; ఇంకా నెలత తగ్గనపు టికీ ఉదయగిరి, ఆత్మకూరు నియోజక వర్గ బిజెపి కార్యకర్తలను సమీకరించి, ఎన్నికలకు సమాయత్తం చేయడం కోసం 30 తేది నెల్లూరు వస్తున్నారు. ఆయనకు ఉదయగిరిలో పోటీ చేసే ఆలోచన వుందని ఒక వదంతి. కాని ఢిల్లీ స్థాయికి ఎదిగిన నాయుడు గారు మళ్లీ అసెంబ్లీ ఉచ్చులో ఇరుక్కొంటారని మేము భావించడం లేదు. ఆ స్థాయి దాటి పోయాడాయన.

వెంకటేశ్వర విసిగా తొలి నెల్లూరీయుడు

తిరుపతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపించి నలభై ఏళ్లయింది. నెల్లూరు జిల్లా మొదటి నుంచి అందులో భాగమే. కాని



ఏనాడూ ఆ మహా సంస్థకు ఒక నెల్లూరీయుడు వైస్ ఛాన్సలర్ కాలేదు. నాలుగు దశాబ్దాల తర్వాత ఇప్పుడా ముచ్చట తీరింది. నెల్లూరీయుడు, విశ్వవిద్యాలయంలో జంతు శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రాళ్లపల్లి రామమూర్తి వైస్ ఛాన్సలర్‌గా నియమితులైనారు. రామమూర్తి గారు బహుముఖ ప్రజ్ఞాధురీణులు. అధ్యాపక వృత్తిలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన సమర్థులు. విఆర్ కాలేజి పాత విద్యార్థి, డెమాన్‌స్ట్రేటర్‌గా జీవితం ప్రారంభించి వైస్ ఛాన్సలర్‌గా ఎదగ గల్గిన అదృష్ట వంతుడు. ఆయనకు మా హార్దికాభినందనలు.

నెల్లూరు పేరు నిలబెట్టి, ప్రతిష్ఠ పెంచిన రామమూర్తి గారిని విఆర్ కాలేజి వంటి సంస్థలు ఆత్మీయంగా సత్కరించడం ధర్మం.

నెల్లూరు అభ్యర్థులకు శేషన్ వాతలు

చండశాసనుడు శ్రీ టి.ఎన్. శేషన్ గారి ఎన్నికల నిబంధనావళి అనలతే నేను బత్రం అప్పుడే అభ్యర్థుల వీపుల పై నాట్య మాడుతున్నది. హడలి చస్తున్నారు అభ్యర్థులు. కలెక్టర్ గారు వెయ్యి కళ్లతో కనిపెడు తున్నారు. వారి నడవడికను! ఎన్నికల ప్రచారంలో ఈ భయం ప్రభావం ఎంత తీవ్రంగా వుంటుందో చూచి ఆనందించ బోతున్నాం మనమంతా.

సర్వేపల్లి ఎమ్మెల్యే శ్రీ సి.వి. శేషారెడ్డి ప్రభుత్వ విప్‌గా తనకు ఇచ్చిన కారును హైదరాబాద్‌కు పంపేశారు. చంద్రమోహన్ రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారట - ఎన్నికల ప్రచారానికి ఈ వాహనం వాడ బడుతున్నదని! అయితే శేషారెడ్డి నుంచి కలెక్టర్ కారును స్వాధీనం చేసుకొన్నారన్నది తప్పు వార్త.

ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ శ్రీ చెలికం శంకర రెడ్డి కారు వాడకం పై అభ్యంతరాలు వచ్చాయి; కలెక్టర్ గారి ఆదేశం మేరకు దాన్ని ఆర్‌టిసికి అప్పగించేశారు.

బిజెపి అభ్యర్థులు

జిల్లాలోని 7 నియోజక వర్గాలకు బిజెపి ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించింది. వారు వీరు నెల్లూరు - శ్రీ ఆమంచర్ల శంకర నారాయణ; కోవూరు - డాక్టర్ వరదయ్య; ఆత్మకూరు - దువ్వూరు రాధాకృష్ణా రెడ్డి; సూళ్లూరుపేట - సంపత్ కుమార్; సర్వేపల్లి - అన్నం శ్రీనివాసులు; వెంకటగిరి - రంగినేని కృష్ణయ్య; కావలి - కె. సత్యనారాయణ.

సణుగుడు | 7-పేజీ కొరవ

ఎప్పుడెక్కడ లాభం వుంటుందనిపిస్తే అక్కడే మకాం!

స్నేహం చేసినా, శత్రుత్వం నెరపినా వ్యక్తిగత ప్రయోజనాలు, కక్షలు, స్పర్థలు తప్ప పార్టీ మేలుకాని, ప్రజల శ్రేయస్సుగాని ఫ్యూడల్ శక్తులనదగిన వారికి గుర్తుకురావు. సుబ్బరామి రెడ్డి గారు అసలు సిసలు ఫ్యూడలిజానికి ప్రతీక వలె ప్రవర్తిస్తున్నారు. సిద్ధాంత నిబద్ధత, ప్రజలిమనుకుంటారనే వెరపు వుండవుగాబట్టి వారు తమను వ్యతిరేకించే కాంగ్రెస్ అభ్యర్థులందరినీ ఓడిస్తామని బహిరంగంగా చెప్పగల్గుతున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులను, అభ్యర్థులకు లక్షలకు లక్షలు డబ్బు అందజేయగల్గుతున్నారు.

అంతకంటె ప్రమాదకరమైనది, తమ బంధువులకు, తమ అడుగులకు మడుగులొత్తేవారికి, తమ దగ్గర పాలేర్ల వలె పడి వుండే వారికీ తప్ప మరెవ్వరికీ పదవులు రాకూడదన్న ఆలోచన. అందువల్లే వారు స్వతంత్రంగా వ్యవహరించే కలికి యానాదిరెడ్డి, సివి శేషారెడ్డి, డాక్టర్ సుందరరామిరెడ్డి, వసల పెంచలయ్య వంటి మధ్యతరగతి నాయకులను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. కారణం లేకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారు. డబ్బులేని వారనే చులకన భావం, మధ్యతరగతి వ్యక్తుల పట్ల హేళన వైఖరి తప్ప- యానాదిరెడ్డిని, విష్ణువర్ధనరెడ్డిని ఇంటికి పంపించడానికి యత్నించ డంలో వేరే పరమార్థ మేముంది? తమ స్వంత గ్రూపులో వున్నా, వ్యక్తిత్వంతో బ్రతకబోవడం వారు చేసిన మహాపరాధమా? డబ్బులేనివారు ఆత్మగౌరవంతో బ్రతకడానికి అనర్హులా?

ఇటువంటి ధన దురహంకార వైఖరులను ప్రజలు క్షమించరు. చరిత్ర పుస్తకంలో ఏ పుట తిరగవేసినా ప్రజా తీర్పును ప్రతిఫలింపజేసే సాధ్యాలు కోకొల్లలుగా లభిస్తాయి. వాటిని అర్థం చేసుకొని పద్ధతి మార్చుకుంటె ప్రజలు హర్షిస్తారు; లేకుంటె చరిత్ర హీనులుగా తెరమరుగైపోతారు.

కాంగ్రెస్

2 పేజీ కొరవ

మైనారిటీలకు అవకాశమిస్తే నీకినని నమ్మబలికి సుబ్బరామరెడ్డి గారు మాజీ కౌన్సిలర్ సందానిభాషాను ఢిల్లీకి వెంటబెట్టుకుని పోయివున్నారు. బ్రాహ్మణులకోటా క్రింద డాక్టర్ మధుసూదన శాస్త్రి ఆశ వుండనేవుంది. శాస్త్రిగారి విషయం ద్రోణంరాజు పట్టు పట్టి వున్నారు. కాని విశాఖ నుంచి నెల్లూరు వరకు సిట్టడిగే స్థాయి ద్రోణంరాజుకింకా రాలేదు. ప్రధానితో పాత పరిచయం ఏదైనా ఫలిస్తుందా? అనుమానమే.

సర్వేపల్లిలో సి.వి.శేషారెడ్డి ఈ కాటాకుస్తీలతో నిమిత్తం లేకుండా ఇల్లిల్లూ తిరిగి ప్రచారం చేసుకుంటూ పోతున్నారు. ఢిల్లీకి కాదు కదా, కనీసం హైదరాబాదుకు కూడా వెళ్లలేదు. వద్దించేవాడు మనవాడైతే ఎక్కడుంటే ఏమి చెప్పండి? జనార్ధనరెడ్డికి ప్రతిష్ఠాకరమైన అభ్యర్థి శేషారెడ్డి; అంత సులభంగా వదలి పెట్టడు. మాగుంటవారు జెకెరెడ్డిని ప్రతిపాదిస్తున్నారు. కాని నెల్లూరు ఎందుకు వద్దంటున్నట్లు, సర్వేపల్లి ఎందుకు కోరుతున్నట్లు అనే ప్రశ్నవస్తే ఏమి సమాధానం చెప్తాడు? సిట్టింగ్ స్థానం వద్దనడానికి కారణం వుండాలి కదా! ఓటమి భయమా? వున్న చోటనే గెలవలేనప్పుడు పొరుగు చోట ఎట్లాగెలుస్తారు? మాగుంట వారికోసం త్యాగం చేయడమా? అది వ్యక్తి ప్రేమ తప్ప, పార్టీపై ప్రేమకానప్పుడు ఒకరి స్వార్థం కోసం ఇంకొకర్ని ఎందుకు బలిచేయాలి? జెకె ప్రయత్నం ఇక్కడ వ్యర్థమే. అది మాగుంటవారికీ తెలుసు. కాని ఆట పట్టించడానికి ఆశ చూపి వినోదిస్తున్నారు. కావలి, కోవూరులలో జెకె పేరు చెప్పడమూ ఈ పరిహాసంలో భాగమే.

కోవూరులో బెజవాడ సురేష్‌రెడ్డి పేరు ప్రతిపాదించారు మాగుంట వర్గీయులు. జెకెది సెకండ్‌నేమ్! జనార్ధనరెడ్డి ఇక్కడ పి.వి. ప్రసన్నరెడ్డిని నిల్పితే బాగుంటుందని సూచించినట్లు వదంతి. బిసి కోటా క్రింద ఇంకెక్కడా ఎవరికీ సీటు ఇవ్వనప్పుడు ఐ.ఎన్.టి.యు.సి. రాధయ్యకు ముళ్లకిరీటం అలంకరిస్తారా?

అల్లూరులో విష్ణుకు సెకండ్ ఛాన్స్ ఇచ్చి తీరాలని ముఖ్యమంత్రి చాలా పట్టుదలగా వున్నారట. కాని, ఈ సీటు తన కుమారుడు ప్రభాకరరెడ్డికి ఇవ్వాలని పెళ్లకూరు రామచంద్రారెడ్డిగారు పి.వి.కి స్పెషల్ విజ్ఞప్తి చేశారు. అంతగా అయితే విష్ణును కోవూరుకు పంపించుకోండి అని ఉచిత సలహా పారేశారట. సి.పి.ఎం. అభ్యర్థిత్వం పట్ల వ్యతిరేకత వున్న తెలుగుదేశం వాదులు కాంగ్రెస్‌కు పనిచేస్తారనే ఆశ పెళ్లకూరును ఊరిస్తున్నది. జనార్ధనరెడ్డి గారు సామంతు సుబ్బారెడ్డిని ప్రతిపాదించారట కాని, అందుకాయన ఇష్టపడ్తున్నట్లు లేదు. దగదర్తి మాజీ మండలాధ్యక్షుడు శ్రీ వేములపాటి ఆదిశేషయ్య పట్ల సానుభూతి చూపుతారా? చెప్పలేం!

కావలి యానాదిరెడ్డిని బలిపెట్టడానికి మాగుంట సుబ్బరామరెడ్డి చేస్తున్న యత్నాలు ఫలించవనే భావించాలి. తనను కాదని తాత్కాలికంగా ఆ గడప తొక్కినా, జనార్ధనరెడ్డికి యానాదిరెడ్డి మీదనే సాఫ్ట్‌కార్నర్! ఒక లేడీ డాక్టర్ పేరు కూడా పరిశీలనలో వున్నట్లు వినికిడి; ధృవపడలేదు.

ఉదయగిరిలో మాదాల జానకిరాం టిక్కెట్‌కు పాత వ్యాపారం తాలూకు కస్టమ్స్ ఎగవేత కేసును అడ్డం వేస్తున్నారు. జానకిరాం ఉభయచరుడు కదా- మాగుంట, జనార్ధనరెడ్డిలిద్దరూ ఆయన పేరే చెప్తున్నట్లున్నారు. అందువల్ల ఆయన అభ్యర్థిత్వం డబుల్ స్ట్రాంగ్‌గా వుంటుంది. రాజమోహన్‌రెడ్డికి సి.ఎం. ఆశీర్వాదం, పి.ఎం. చేస్తాడన్న ఆశ రెండూ వున్నాయి. కాని కాంగ్రెస్‌కు జానకిరాం తప్ప మరొక కమ్మ అభ్యర్థి లేరు జిల్లాలో! బలీయమైన ఆ కులాన్ని విస్మరించగలరా?

ఆత్మకూరులో లెక్క ప్రకారం డాక్టర్ సుందర రామ రెడ్డికి తిరుగుండ కూడదు. గెలిచే అవకాశాలు ఆయనకే ఎక్కువ. కాని ఇంత కాలం జనార్ధన రెడ్డికి విధేయుడిగా వుండిన వాడు, ఆయన నుంచి ఎస్.ఎఫ్.సి. వంటి పెద్ద పదవి పొందిన వాడు వున్నట్లుండి బోర్డు త్రిప్పి ఈ గడప, ఆ గడప త్రొక్కుతున్నాడు. మూడు సార్లు ఎమ్మెల్యేగా చేసిన నాయకుడి పట్ల అంత విశ్వాస హీనంగా ప్రవర్తించడం సుందర రామరెడ్డి వంటి పెద్ద మనుషులు చేయదగిన పని కాదు. అయితే జనార్ధన రెడ్డికి ఇప్పటికీ ఆయన పైనే గురి. ఈ రాకపోకలు తాత్కాలికమని భావిస్తున్నారు. గంగాధరం - సింగాపురం రాజేశ్వర రావు ద్వారా స్వంత ప్రయత్నం చేస్తున్నారు. పూసల రంగయ్య కూడా అదృష్టం పరీక్షించు కుంటున్నాడు.

రాపూరులో ఆనం రామనారాయణ రెడ్డి టికెట్ విషయంలో అనుమానమే లేదు. దురదృష్టవశాత్తు మాగుంట సుబ్బరామ రెడ్డి గారిక్కడ ఆనం వారికి ప్రతిగా ఒక మనిషిని సైతం సంపాదించ లేకపోయారు. రావుల అంకయ్య గౌడ్ తమ అభ్యర్థి అన్నది కేవలం కంట నీడి తుడుపే. నేర చరిత్ర కల వారికి టిక్కెట్ లేదని ఒక వంక పి.వి. పదే పదే చెప్తుంటే, నాసా క్రింద అరెస్టయిన గౌడ్‌కు టిక్కెట్ ఎట్లా వస్తుంది? అది సుబ్బరామ రెడ్డి గారికీ తెలుసు. కాని బయటకు చెప్తే గౌడ్ నోటి నుంచి వచ్చే తిట్లు భరించడం కష్టం. అందువల్ల ఆఖరు వరకు నీకే టికెట్ అని ఆశ పెడుతూ వుంటారు.

వెంకటగిరిలో టిక్కెట్ ఇప్పిస్తామని చెప్పి శ్రీ వేమారెడ్డి రామచంద్రా రెడ్డి గారిని నిన్న విమానంలో తీసుక వెళ్లాడు మేగౌరె. సుబ్బరామ రెడ్డి గారు ఎటూ కేంద్రంలో మంత్రిగా వెళ్లి పోతాడు కాబట్టి, జిల్లాలో నువ్వే నాయకుడివి. మా గ్రూపంతా నీ గుప్పెట్లో పెడ్తాం అని ఆశ పెట్టి బుట్టలో వేసుకున్నారట. రామచంద్రా రెడ్డి వంటి సీనియరు, ఎన్నో రాజకీయ ఎగుడు దిగుడులు చవిచూసిన అనుభవశాలి అంత అమాయకంగా వెంకటగిరి టికెట్‌కు ఆశపడి, ఢిల్లీకి వెళ్లడం ఆశ్చర్యంగా వుంది.

కానీ ఆయనది విహార యాత్రేతప్ప, రాజకీయ ప్రయోజన యాత్ర కాజాలదు. జనార్ధన రెడ్డిని కాదని వేరే వారికి టిక్కెట్ ఇచ్చే వారెవరు? చావుకు పెడితే లంఖణానికి వచ్చినట్లు వెంకటగిరికి ఎసరు పెడితే గూడూరు తన వాడైన ఓడూరు రామచంద్రయ్యను వరిస్తుందని వేమారెడ్డి తలపోస్తు న్నట్లున్నాడు. కానీ అదీ అడియాశే. పత్రా ప్రకాశ రావును కాదని పోదు గూడూరు టిక్కెట్.

ఇంత దూరం వచ్చిన తర్వాత తనకు, తన వాడికి టికెట్ రాలేదని గూడూరులో వ్యతిరేకం చేస్తాడా వేమారెడ్డి? మేమనుకోము. రామచంద్రా రెడ్డి గారు ఎప్పుడూ కాంగ్రెస్ విద్రోహి కాదు, కాలేదు.

సూళ్లూరుపేటలో మంత్రి శ్రీ పసల పెంచలయ్యకు ప్రతిగా పూటుకూరు ఆదిమూర్తిని ప్రతిపాదించి తమ సంస్కారం చాటుకున్నారు మాగుంట వర్గీయులు. చర్చించడం కూడా వ్యర్థం ఈ విషయంలో!

ఇదీ కాంగ్రెస్ టిక్కెట్ల వరుస. ముందు ముందు ఎన్ని సుడులు తిరిగినా, కాంగ్రెస్ టిక్కెట్ల బండి చివరి కొచ్చేసరికి జనార్ధన రెడ్డి దగ్గర బుద్ధిగా నిల్చిపోవడం అనవాయితీ. అప్పుడూ ఆ అనవాయితీకి మినహాయింపు వుండదు. కానీ జనతాదళ్ నుంచి రామ్ లఖన్ యాదవ్ వగైరా ఏడుగురు ఎమ్పీలు కాంగ్రెస్‌లోకి దుకినప్పుడు వారికి 15 కోట్ల రూపాయల ముడుపు చెల్లించామని, తమ నుంచి అంపాయం పొందిన పి.వి. ఇప్పుడు తమ మాట కాదనలేడని, తమ జాబితాను తిరస్కరించడలేడని మాగుంట వర్గీయులు ధీమాగా చెప్తున్నారు. ఇది నిజమా! అంత పెద్ద మొత్తం వారు పి.వి.కి ఇచ్చి వుంటారా? ఏమో! మొత్తానికి కాంగ్రెస్ శేదో శని పట్టినట్లుగా ఫ్యూడల్ శక్తులన్నీ ఏకమై, విజృంభిస్తున్నాయి. కాంగ్రెస్ వాదులందరూ మెలకువగా వుంటే అటువంటి అవాంఛనీయ ధోరణులను అరికట్టడం పెద్ద కష్టం కాదు.

సణుగుడు

4 పేజీ కొరవ

విశుద్ధ వర్తనం గురించి మాట్లాడడం అనవసరం. కాంగ్రెస్‌లో ఏ నాయకుడికి అది వుండదు. ఎవరూ అందుకు మినహాయింపు కాదు.

పార్టీ క్లిష్ట సమయంలో వున్నప్పుడు సుబ్బరామరెడ్డిగారు కాంగ్రెస్‌ను ఆదుకున్న సందర్భం ఏదైనా వుందా? కాంగ్రెస్ కోసం ఆయన ఆఫీసు భవనమో, మరొకటో సంస్థలు నెలకొల్పారా? కాంగ్రెస్ కార్యకర్తలను ఆదరించి, అభిమానించిన సాదృశ్యం ఏదైనా వుందా? ఇటువంటి ప్రశ్నలన్నింటికి వచ్చే సమాధానం ఒక్కటే- 'లేదు' అన్నది.

మరి ఏ అర్హతతో, అధికారంతో ఆయన తనను తాను కాంగ్రెస్ పార్టీకి ప్రతిరూపంగా భావించుకొని, తన సభకు రాని వారందరూ కాంగ్రెస్ టిక్కెట్లకు అనర్హులనే దృఢాభిప్రాయానికి వచ్చారు?

సి.వి. శేషారెడ్డి, పత్రా ప్రకాశరావు, పసల పెంచలయ్యాదులు జనార్ధనరెడ్డి అనుచరులు కాబట్టి, మీటింగు సాకుతో వారి టిక్కెట్లకు అడ్డంపడి యాతన పెట్టడంలో అర్థం వుంది. కాని తన అనుచరులుగా, స్నేహితులుగా, ముఖ్యులుగా వుండిన కలికి యానాదిరెడ్డి, విష్ణువర్ధనరెడ్డిల గొంతు కోయను ప్రయత్నించడానికి కారణమేమిటి? విష్ణు మీటింగుకు కూడా హాజరైనాడు కదా పాపం! జెకెరెడ్డి పరిస్థితేమిటి? ఏదో ఆశతోనే, అవసరంలోనో ఐదేళ్లపాటు స్నేహం చేసిన ఆనం వారిని వదలుకొని ప్రక్కన చేరితే- ఆయన్ను కొద్దిసేపు కావలికి, మరికొంతసేపు కోవూరుకు పంపుతున్నట్లు చెప్పి అపహాస్యం పాల్జేస్తున్నారు. ఆయన స్వంత సీటైన నెల్లూరులో ఆయన పేరు పీకి పారేశారు. రెంటికి చెడిన రేవడిగా ప్రజలలో చులకనైపోయాడు జెకె.

నువ్వుల వెంకటరత్నం నాయుడు కుటుంబానికి తాను ఇంటి పెద్దగా వుంటానని, వారి అప్పులన్నీ కట్టి, టిక్కెట్ ఇప్పించి, గెలిపిస్తానని పత్రికలలోనే ప్రచారం జరిపించారు సుబ్బరామరెడ్డిగారు. నాయుడు కుమారుడు తెలుగుదేశంలోకి పోలోతే పట్టి బలవంతాన నిల్పారు. పాపమా పిల్లవాడు కూడా అప్పుడు రెంటికి చెడిపోయాడు.

ఈ మూడేళ్లుగా మూదాసు గంగాధరం సుబ్బరామరెడ్డిగారికి చేసిన సేవలు అన్నీ ఇన్నీ కావు. ఇంట, బయట, ఆఖరకు పడకటింట్లో కూడా సుబ్బరామరెడ్డిగారికి సౌకర్యాలు సమకూర్చడంలోనే తన జీవితం ధన్యమౌతుందన్నంత హనుమద్భక్తితో సేవించి, తరించాడు. తీరా టిక్కెట్ల దగ్గరకొచ్చేసరికి, "గంగాధరయ్యా, నిన్నుమోయడం నాతరం కాదయ్యా" అని చెప్పి తప్పించుకోజూచారు సుబ్బరామరెడ్డిగారు.

అన్నిటినీ మించినది జనార్ధనరెడ్డితో వారి సాన్నిహిత్యం! వారిని రాజకీయాలలోకి తెచ్చింది ఆయన; అందల మెక్కించింది ఆయనే; ముఖ్యమంత్రిగా వున్న రెండేళ్లు సుబ్బరామరెడ్డిగారి నివాసం, సావాసం జనార్ధనరెడ్డితోనే! ఎప్పుడూ వదలి వుండే వారు కాదు; జంటగా కన్పించే వారు; వ్యాపార పరంగా వారా రెండేళ్లు లాభపడిన తీరు మాటల్లో చెప్పలేము. కాని పదవి పోయేటప్పటికి జనార్ధనరెడ్డి పనికి రాకుండా పోయాడు. అప్పటివరకు తాము పొందిన లాభాలన్నీ మరుపుకు వచ్చేశాయి.

అధికారంలో వున్నాడు కాబట్టి కొత్త ముఖ్యమంత్రి శ్రీ విజయభాస్కరరెడ్డితో కొద్ది కాలం చుట్టరికం నెరపారు. నీవెంటే వుంటాం, నీ నీడనే నడుస్తాం అని బాసలు చేశారు. టిక్కెట్ల దగ్గర ఆయన తమ మాట వినడం లేదనే సందేహం కల్గగానే అభ్యర్థుల చీటీలు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతికిచ్చి నెయ్యం నెరపుతున్నారు.

ఒక్క విషయంలో నిలకడలేదు, ఒక్క నాయకుడితో విశ్వాసపాత్రత లేదు. ఒక్కరితో, నికరమైన స్నేహం లేదు, సహాయం చేసిన వారి పట్ల కృతజ్ఞత లేదు, సేవలు చేసినవారి పట్ల సానుభూతి లేదు. నమ్మివెంట నడిచిన వారిపట్ల గౌరవం లేదు. అంతా వ్యాపార దృక్పథం; ఎప్పుడు ఏది అవసరమనిపిస్తే ఆ మార్గం; ఎప్పుడు ఎవరితో పనిబడితే వారితోనే స్నేహం.

కొరవ 7 పేజీలో

శివారెడ్డి పద్యాలు

బమ్మెరపోతన్న

శ్రీపొమ్ము కంబెవిపయమేలంటుంది
బమ్మెరపోతరాజా భాగవతము
కూడ్రపక్షిపొత్తు పొమ్ము కీరానమ్ము.
పంచదారపేమ్యపాయసమ్ము!

సినీతారజయప్రద

సినీనాట్యరంగంస్త్రీజాతికీనాడు
అనేకగొప్పకోర.అందచందం
ప్రతిదినెలసినీవపర్యాపుపారపాటు
పార్టీకిప్పుఅనేకపాయకాపం!

గిరజ

కవితలంటేచాలుకళ్ళద్దుకుంటుంది
పిన్నపెద్దలంటేప్రీతిమెండు
ఆమెపేరుగిరిజ!అందాలజాబిల్లి
నీతినిష్ఠమెండునిండుకుండ!

శ్రీలంకబాంబుప్రేలుడు

అంతుపంతులేదుఅయుమ్మఎవరైంది?
ఎక్కడైంది?అడిగెదిక్కులేదు
కోట్లుకోట్లుమిల్లిటెంట్లుఎక్కడలట్లు!
రామరానుఒకటేరక్తపాతం!

ఎన్నికలు

ఎన్నికలనుగూర్చిఏముంద్రాసేది
ఎవరుగెల్చిచేసేదేమికవికి?
కాంగిరేసుగెలుపుభాయమ్మగావచ్చు!
పాఠకులకుమీకుప్రతిదిదెలుసు!

పి.వి. మొదటి పేజీ కొరవ

నలుగురైదుగురు సీనియర్లు మాత్రమే పివిని చూడగల్గుతున్నారు. అయితే వారితోనూ టికెట్ల విషయం చర్చించే తీరిక పివికి లేదు. "ముందు కర్ణాటక కానివ్వండి, చూద్దాం" అని ముక్తసరిగా సమాధానమిచ్చి పంపేస్తున్నారు.

కర్ణాటక టిక్కెట్ల భాగోతం ఈరోజు (28తేది)తో ముగుస్తుందని అంచనా. అందువల్ల ఆంధ్ర వ్యవహారాలు రేపటి నుంచి పరిశీలనకు రావచ్చు. రాష్ట్ర దరఖాస్తుల స్క్రీనింగ్ కమిటీ కూడా ఇంకా సమావేశం కాలేదు. ఈ కమిటీ జాబితా కత్తిరింపు పూర్తయి, పివి పరిశీలన జరిగి, తుది జాబితా వెలువడేసరికి 3తేది పట్టవచ్చునని భావిస్తున్నారు.

ఇదిట్లా వుంటే నెలరోజుల నుంచి జరుగుతున్న డిసిసి, పిసిసి, పిఇసిల జాబితాల రూపకల్పన అంతా ఒక ఫార్సేనని భావింపబడుతున్నది. వీటిని పట్టించుకునే పరిస్థితిలో ప్రధానమంత్రి లేరు. వివిధ వర్గాలనుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఆయనొక సమగ్ర జాబితా రూపొందించుకుని వున్నారని, తనను కలవవచ్చే వారిచ్చే చీటీల పేర్లు, తన చిత్రగుప్తుడి చిట్టాతో సరిపోతే టిక్కు కొట్టడం; లేకుంటే ఆ చీటీలు, లిస్టులు చెత్తబుట్టలో వేయడం ఆయన ధోరణిగా కన్పిస్తున్నదని అంతరంగికులు చెప్తున్నారు. పైపెచ్చు ఆయన కొన్ని ప్రైవేటు సంస్థల ద్వారా కూడా కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు, అభ్యర్థుల జాతకాలపై సర్వే జరిపించి వున్నారట. అభ్యర్థుల నిర్ణయం, ఎన్నికల ప్రచార శైలి తదితరాలపై పివి వైఖరిని ఈ సర్వేలు ప్రభావితం చేయనున్నాయి.

ఇదిట్లా వుంటే గతంలో ఇందిరా, రాజీవ్ గాంధీల వలె సీట్ల పంపకంలో సలహాలు, సిఫార్సులకోసం పివి ఎవరిపైనా ఆధారపడక పోవడం; ఒక్కర్నీ దగ్గరకు చేరనివ్వకపోవడంతో రాష్ట్ర నాయకులకు పిచ్చెత్తినట్లు వుంది. ఇదివరకు ధావన్‌నో, ఫోతేదార్‌నో, జార్జినో, అరుణ్‌నెహ్రూనో, అటువంటి వారు మరెవ్వరినో గట్టిగా పట్టుకొని, పరిచయాలు పెంచుకొని,సీట్లకోసం చెప్పించుకునేవారు. పివి ఇంట, బయట కూడా అటువంటి వ్యక్తులెవరూ వీరికి తారసపడడంలేదు. పివి కొడుకులుకాని, దగ్గరి బంధువు రాజేశ్వరరావుకాని పివి దగ్గరకు వెళ్ళడానికే జంకుతున్నారు. ఈ విచిత్రమైన పరిస్థితిలో ముఖ్యమంత్రి నుంచి ప్రతి ఒక్కరూ ఢిల్లీలో వుండి ఏమి చేయాలో అర్థంకాక, వట్టి చేతులతో తిరిగి రావడానికి మనస్కరించక సతమతమై పోతున్నారు. స్క్రీనింగ్ కమిటీ బహుశా ఈ రోజు (28తేది) సాయంత్రం ఇష్టాగోష్టిగా సమావేశమయ్యే అవకాశం వుందంటున్నారు.

అన్ని వర్గాలవారు మాత్రం తమతమ పేర్లతో లిస్టులు వ్రాసి పెట్టుకొని రెడీగా వున్నారు. సిఎం జాబితా పెరిగి పెరిగి కొండవీటి చాంతాడంత అయ్యిందట. 180 స్థానాలలో తన అభ్యర్థులను సూచిస్తున్నాడాయన. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా రాయలసీమకు పరిమితం కాకుండా, ద్రోణంరాజు వంటి వారి సహకారంతో రాష్ట్రమంతటా తమ అభ్యర్థుల పేర్లు వ్రాసి పెట్టుకొని వున్నారు. వెంకటస్వామి, హనుమంతరావు - వంటి వారూ బిసిలు, ఎస్‌సిల జాబితాలు వ్రాశారు.

సింగాపురం రాజేశ్వరరావు, పి. ఉపేంద్ర పివికి చెప్తామనే భరోసా ఇస్తుండడంతో వారి చుట్టూ జనం ఈగలు ముసిరినట్లు ముసురుతున్నారు. ముఖ్యమంత్రికి కూడా పూపిరిసల్పని ముట్టడి సమస్యగా వుంది. పివి మాత్రం నింపాదిగా కూర్చుని ఈ వినోదం తిలకిస్తున్నారు.

పంచాంగం

29 తేది శనివారం శుక్రవార్యమి

పండుగలు

1తేది మంగళవారం ఆంధ్ర రాష్ట్రావతరణ. రాత్రికి నరక చతుర్దశి.
3 తేది గురువారం దీపావళి

ఆశ్వయుజ బహుళ

అక్టోబర్ తిథులు

త29శని ద శమి రా.గ .4.26 వరకు
త30 ఆది ఏకాదశి రా.గ. 3.16 వ
త31 సోమ ద్వాదశి రా.గ. 1.53 వ

నవంబరు తిథులు

త1మంగళ త్రయోదశి రా.గ12.02 వ
త 2బుధ చతుర్దశి రా.గ. 10.00 వ
త3 గురు అమావాస్య రా.గ 7.45 వ

కార్తీక శుద్ధ

త4 శుక్ర పాడ్యమి సా.గ 5.25 వ

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఏ

నీటి మట్టం

కనిగిరి రిజర్వాయరు	17.5 అ
సర్వేపల్లి రిజర్వాయరు	5.2 అ
నెల్లూరు చెరువు	12.5 అ

అద్దంకి సబార్డినేటు జడ్జివారి కోర్టులో

EP. 28/93 in SC 4/91

గోగినేని హనుమంతరావు -DHR
పొంచర్ల యేసుదాసు -JDR

వేలం ప్రకటన

ఈ క్రింద కనుబరచిన JDR తాలూకు ఆస్తిని కోర్టువారిచే 8-11-94తేదిన ఉదయం 10.30 గంటలకు బహిరంగముగా వేలం జరుపబడును. ఆసక్తికలవారు పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అద్దంకి సబ్‌రిజిస్ట్రేషన్‌లో చేరిన బొడ్డువాని పాలెం రెవిన్యూ విలేజిలోని పట్టా నంబరు 679 సర్వేనంబరు 180లోని పూరా విస్తీర్ణం. య.18.72 సెంట్లు లోని య. 6.30సెంట్లు మాగాణి భూమి. తూర్పు: మొరవనేని కోటయ్యగారి భూమి; దక్షిణం: JDR వగైరాల తాలూకు భూమి; పడమర: బూదరాజు కొండయ్య, మొరవనేని వెంకటస్వామి గార్ల భూమి; ఉత్తరం: పూసాల సీతారామయ్యగారి భూమి; ఈ హద్దులలోని య. 6.30 సెంట్లు మాగాణి భూమి.

DHR విలువ రు.25,000/-, అమినా విలువ రు. 1,57,500/- లు

N.B:- రు.7000/- ఇండియన్ బ్యాంకు మేదరమెట్ల (2570/81) రుణము తీర్పబడి నందున లోబడకయే వేలం జరుగవలసి యున్నది)

ఉప్పలపాటి లక్ష్మీనారాయణ,
DHR తరపు అడ్వకేటు,
అద్దంకి - 523 201.

బాలు చిత్రంలో విశ్వనాథ్ నటిస్తున్నాడు!

వాహినీ స్టూడియోలో సౌండ్ ఇంజనీర్‌గా వుండిన కాశీనాధుని విశ్వనాథ్ - ''తేనెమనసులు'' చిత్రాన్ని కొత్త తారలతో తీయడానికి ఆదుర్తి సన్నాహాలు చేస్తున్నపుడు ఆ చిత్రానికి సహకార దర్శకుడుగా చేరారు. కృష్ణ, రామ్మోహన్‌లకు ముందు ఆదుర్తిగారు ఎందరో నటులకు మేకప్ టెస్టులు జరిపి, అసంతృప్తి చెందిన తరుణంలో 'సరైన హీరో ఎవ్వరూ దొరక్కపోతే మా విశ్వనాథ్‌నే హీరో చేసేస్తాను,'' అంటుండేవారు. విశ్వనాథ్ డైరెక్టర్ అయ్యాక నటీనటుల నుంచి తనకు కావలసిన ఎఫెక్ట్ రాబట్టుకోవడానికి ఒపికతో ఒకటికి పదిసార్లు తానే నటించి చూపేవారు. ఆయనలో ఎంత గొప్ప నటుడున్నాడో చాలా మందికి తెలుసు. ఆయన దర్శకత్వంలో కమలహాసన్ హీరోగా ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం నిర్మిస్తున్న చిత్రంలో ఒక క్లిష్టమైన పాత్ర వుంది. దానిని విశ్వనాథే చేయాలని కమలహాసన్, బాలు బలవంతం చేసి ఒప్పించారు. తనను సినీ గాయకునిగా పరిచయం చేసిన ఎస్.పి.కోదండపాణి స్మృతి చిహ్నంగా రికార్డింగ్ థియేటర్ నెలకొల్పిన బాలు ఆయన స్మృతి చిహ్నంగానే శ్రీ కోదండపాణి ఫిలిమ్ సర్క్యూట్ పతాకంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఆమని ప్రధాన నాయిక. ప్రియారామన్ మరో నాయిక. గొల్లపూడి మారుతీరావు, కోట శ్రీనివాసరావు, శుభలేఖ సుధాకర్, ఆలీ, సాక్షిరంగారావు, రాళ్ళపల్లి, మల్లికార్జునరావు, వైష్ణవి, రాధాకుమారి ఇతర పాత్రధారులు. మాటలు: గొల్లపూడి; పాటలు: వేటూరి, సిరివెన్నెల, వెన్నెలకంటి; సంగీతం: ఎం.ఎం. కీరవాణి; కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వం: కె. విశ్వనాథ్.

మరో ద్విపాత్రాభినయం ''సింహగర్జన''

చరిత చిత్రవారి ''సింహగర్జన''లో కృష్ణంరాజు ద్విపాత్రాభినయం వారిచే ఆకర్షణ అంటున్నారు దర్శకుడు కె. అజయ్ కుమార్.

ఇప్పటి హీరోలు ఏమీనేర్చుకోరు- కమలహాసన్

''కొత్త హీరోలు ఎందరో వస్తున్నారు. కాని, మాలాగ నిలబడలేక పోతున్నారు. అందుకు కారణం కె. విశ్వనాథ్, కె.బాలచందర్ వంటి గురువుల వద్ద పనిచేసే మహదవకాశం వాళ్లకు లేక పోవడమే! నేను నేటి స్థితికి రావడానికి ముందు స్క్రిప్ట్ అసిస్టెంట్‌గా, అసిస్టెంట్ డాన్స్ డైరెక్టర్‌గా, ఎడిటింగ్ అసిస్టెంట్‌గా కొన్ని చిత్రాలకు పనిచేసి, ఫిలిమ్ [illegible]ంగ్ అంటే ఏమిటో [illegible]లనుంచి నేర్చుకున్నాను. [illegible] హీరోలకు టెక్నికల్ [illegible]ంతం అవగాహన ఉండదు. [illegible] అన్నారు కమలహాసన్.

నవంబర్‌లో జెంటిల్‌మెన్

''ప్రతిబంధ్, ఆజ్ కా గూండారాజ్'' అనంతరం చిరంజీవి నటించిన హిందీ చిత్రం ''ది జెంటిల్‌మెన్'' నవంబర్ చివరి వారంలో ఉత్తరాదిన విడుదలవుతోంది. అల్లు అరవింద్ నిర్మించిన ఈ చిత్రానికి మహేష్‌భట్ దర్శకుడు.

దర్శకులే సంగీత దర్శకులౌతున్నారు!

ఆదిలో స్వర్గీయ నాగయ్య వంటి బహుముఖ ప్రజ్ఞావంతులు త్యాగయ్య, నాలల్లు వగైరా చిత్రాలను దర్శకత్వంతోపాటు సంగీత దర్శకత్వమూ వహించారు. ఇప్పుడు డైరెక్టర్లు వంశీ, ఎస్.వి. కృష్ణారెడ్డి తమ చిత్రాలకు తామే సంగీతమిస్తున్నారు. కొత్తగా యువ దర్శకుడు సునీల్‌వర్మ ''హలో లవర్స్'' చిత్రానికి దర్శకత్వం వహిస్తూ, సంగీతమిస్తున్నారు.

మీనాక్షి శేషాద్రికి ఇష్టమైనవి...

డైరెక్టర్: స్పీల్‌బర్గ్ ([illegible]కపార్క్); వంటకం: దద్దోజనం; [illegible] ప్రదేశం: కొడైకెనాల్; దుస్తులు: [illegible] డ్రెస్సులు, ప్యాంటు; హాబీ: అంగ్లనవలలు [illegible]; నటుడు: స్వర్గీయ సంజీవ్[illegible]; నటి: జయబాధురి; సంగీత దర్శకుడు: ఎ.ఆర్.రెహమన్; సహనటుడు: రిషీకపూర్; స్నేహితురాలు: మధుబాల!

విడిపోయిన రాజ్-కోటి

సంగీత దర్శకులు స్వర్గీయ టి.వి.రాజు పుత్రుడు రాజ్, ఎస్.రాజేశ్వరరావు పుత్రుడు కోటి కలిసి

కొరవ 11 పేజీలో

చచ్చుకథ, చప్పటి కథనం

పోలీస్ అల్లుడు

చిత్రసమీక్ష

గ్రిద్దలూరుగోపాలరావు

ఈ చిత్రం ఉద్దేశం బాగుంది. ఎందుచేతనంటే చీడపురుగులతో లుకలుకలాడుతున్న సమాజాన్ని మరమ్మత్తుచేసే దృక్పథంతో ప్రతాప్ అనే నిప్పువంటి అసిస్టెంటు పోలీస్ కమీషనర్ పాత్ర సృష్టించబడింది. ఈ ప్రతాప్ పెక్కు మంది పోలీస్ అధికారుల్లాగా తన ఖాకీ గుడ్డలను సంఘవిద్రోహ శక్తులకు తాకట్టు పెట్టలేదు. సమాజంలో విరవిహారంచేస్తున్న విద్రోహాలను హతమార్చటం తన ఉద్యోగ ధర్మంగా భావిస్తాడు. ఉత్తేజంతో కూడుకున్న ఉపయోగకరమైన పాత్ర ఇది.

ఇందులోని మిగతా పాత్రలన్నీ చప్పగా వున్నాయి. న్యాయవాది విశ్వనాథం పాత్ర ఒక మామూలు విలన్‌పాత్ర. పేరుకు న్యాయవాది అయినా అన్యాయాలు, అఘాయిత్యాలు జరపడం ఈ పాత్ర ముఖ్యమైన పని. ఆయన కుమారుడు, మరి ముగ్గురు రౌడీలు ఆయన ప్రతినిధులు. ఆయన కూతురు ప్రతాప్‌ను ప్రేమించి పెళ్ళిచేసుకొని తన తండ్రికి పోలీస్ అల్లుడిని సంపాదించి పెట్టిన పాత్ర. ప్రతాప్‌తో పాటలు పాడుతూ ఆటలాడుతూ సరిపెట్టుకున్న పాత్ర ఇది. ప్రతాప్ చెల్లెలు, తల్లి, పోలీస్ కానిస్టేబిల్ గవర్రాజు ఇలా ఇంకా కొన్ని చిల్లరమల్లర పాత్రలు వున్నాయి. ఈ పాత్రలన్నీ చప్పగా వున్నాయి. విశ్వనాథం పాత్ర పోషించిన కోట శ్రీనివాసరావు, కొడుకు రాజా పాత్రధారి మహర్షి రాఘవ, కూతురు పాత్ర ధరించిన మాలాశ్రీ, ప్రతాప్ తల్లిగా అంజలీదేవి, పోలీస్ కానిస్టేబిల్‌గా బ్రహ్మానందం, ముగ్గురు రౌడీల పాత్రధారుల నటన చప్పగా వుంది.

ఈ చప్పదనానికి కారణం ఈ చిత్రదర్శకుడైన ఎం.బాలయ్య వ్రాసిన కథ చాలా చప్పగా వుండటం. పాత్రల నిర్మాణంలో సరైన అవగాహన లేక పోవడం. హత్యచేసిన ఒక జర్నలిస్టు మాయమవుతాడు. ఇతని కథ మొదటి నుంచి చివరిదాకా చెదురుమదురుగా వినిపిస్తుందే తప్ప, ఆ మాయమైన జర్నలిస్టు నేరాన్ని గురించిన పరిశోధన జరగదు. ప్రతాప్ సంఘ విద్రోహ శక్తులను దండించడం ప్రారంభిస్తాడు. అన్యాయానికి ప్రతినిధిగా వున్న విశ్వనాథం కూతుర్ని పెళ్ళిచేసుకుంటాడు. ఆమెతో డాన్సులు చేస్తాడు. తన చెల్లెల్ని ప్రేమించినట్టు నటించి గర్భంచేసిన విశ్వనాథం కుమారుడు రాజాను నిలదీస్తాడు. తన

కొరవ 11 పేజీలో

జనవాణి

3వ పేజీ కొరవ

ఎదిగిన పెద్దలు, అపర కుబేరులు; హస్తిన మొదలు హైదరాబాద్ వరకు కేంద్ర, రాష్ట్ర రాజకీయాల కళ్ళాలు చేబులో కలిగిన దురంధరులు నెల్లూరులో ఎందరో వున్నారు. కాని మురికిని ప్రక్షాళన చేసే పథకాలు రచించి ప్రజలకు మేలు జేసేవారు లేకపోవడం నెల్లూరికి శాపమా? ప్రజలు చేసుకున్న పాపమా ?

నెల్లూరు -బి.పట్టాభిరామయ్య.

హైదరాబాద్ దూరదర్శన్‌తీరు మారదా?

ఎందరు ఎన్నిరకాలుగా విమర్శించినా హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం వైఖరిలో మాత్రం మార్పు కన్పించడం లేదు. పసలేని కార్యక్రమాలతో ప్రజల ప్రాణాలు తీసేస్తుంటారు. ఆదివారంనాడు ప్రసారమయ్యే తెలుగు సినిమా పూర్తిగా ప్రసారం అయ్యి ఎన్నేళ్లయిందో? చిత్రలహరి కార్యక్రమం ప్రకటనలకే పరిమిత మయ్యింది. పోనీ వార్తావిభాగమన్నా ఉచితంగా పని చేస్తుందా అంటే అదీలేదు. న్యూస్‌రీడర్స్ చదివే తప్పులు భరించలేకుండా వున్నాయి. తెలుగు భాషా ఉచ్చారణా దోషాలతోబాటు కొందరి వ్యక్తులపేర్లు కూడా మార్చి చదవడం జరుగుతున్నది. వుదాహరణకు అక్టోబర్ 16తేది రాత్రి ప్రసారమైన తెలుగు వార్తలలో హర్యానా ముఖ్యమంత్రి భజన్‌లాల్‌ను పంజాబ్ ముఖ్యమంత్రిగా చదివారు. దూరదర్శన్ తలచుకుంటే రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైతం మార్చి వేయగలరని నిరూపించారు. దూరదర్శన్‌లో ప్రసారమయ్యే కార్యక్రమాలు లక్షలాది మంది ప్రజలు చూస్తున్నారనే విషయాన్ని అధికారులు ఎప్పటికి గ్రహిస్తారో... ఏమో!

నెల్లూరు -ఎమ్.ప్రమీల

ముదనష్టపు పోస్టల్‌శాఖ

నిత్యం రేడియోలో ఛీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ గారి 'గోబెల్స్' పోస్టల్ డెలివరీ విధానాల ప్రచారం వినలేక చస్తున్నాం. క్విక్ డెలివరీ పద్ధతి అని ఏవేవో సూచనలిస్తుంటారు. కాని వాస్తవంగా చూస్తే అధ్వాన్నస్థితిలో పోస్టల్ శాఖ వుంది. 'జమీన్‌రైతు' పత్రిక విధిగా నాలుగు వారాలలో ఏదో ఒక వారం అపహరింపబడుతూ వుంది. పత్రిక వారికి ఎన్నోసార్లు వ్రాసి మళ్ళీ పత్రిక తెప్పించుకోవాల్సి వస్తున్నది. డిపార్ట్‌మెంటులో ఎవరో ఒకరు చదవాలనుకుంటే చదివి వెంటనే డెలివరీకి పంపాలి. కాని అట్టే స్వంతం చేసుకునే జాడ్యం కల్గి వుండరాదు. నెల్లూరు పోస్టల్ శాఖ సక్రమంగా డెలివరీ చేయాలనే నైతిక విలువకు కట్టుబడిలేదు. ప్రచారానికిముందు పద్ధతులు ఆచరణలో వుంచాలి. ఇంటుగెలవక రచ్చకెక్కడం అవమానం. ఈధోరణివల్ల ప్రైవేట్ సెక్టార్‌లోని కొరియర్ సర్వీసులు హెచ్చు ఆదరణ పొందుతున్నాయి.

నాగమాంబాపురం -కె.ఎల్.కె.శర్మ.

అప్పులనుండి దేశానికి విముక్తి లేదా?

నానాటికి పెరుగుతున్న ఋణభారం భారతదేశం భుజస్కంధాలపై పెద్ద గుదిబండగా తయారయ్యింది. మునుముందు ఇండియా ఈ విదేశీ ఋణాల ఊబిలోంచి బయటపడే సూచనలు లేవేమో అనిపిస్తుంది. అప్పులు తీర్చడానికి మరికొన్ని అప్పులు చేయాల్సివస్తున్నది. ఎగుమతుల్లో పెరుగుదల నా...మాత్రి... వాణిజ్యావకాశాలు క్షీణించ... ఋ... చెల్లింపుల భారం పెరిగిపో...ు వి... మారక ద్రవ్యనిల్వలు ఎంత వున్నప్పటికి దేశం ఇతర దే... దయాధర్మాలపై ఆధార పడవల... పరిస్థితి దాపురిస్తున్నది. ఆ... క్రమశిక్షణను నిక్కచ్చిగా పాటిం... పొదుపుచేస్తే తప్ప విదేశీ ఋణాన్ని చెల్లించలేం. అంతటి దీక్షా దక్షతలు ఆర్థిక మంత్రిత్వ శాఖకు వున్నవా లే... అనేది భవిష్యత్తులో గానీ తెలియదు. బడ్జెట్‌లో అధికభాగం వడ్డీ చెల్లింపుల... సరిపోతున్నది. ఇక అసలు చెల్లించే దెన్నడు? అప్పుల నుండి విముక్తి పొందే దెప్పుడు?

వెంకటగిరి -జి.పాండురంగయ్య.

బంద్‌లు ఎందుకు?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, వివిధ ఆరోపణలకు నిరసనగా రాజకీయ పక్షాలు, వివిధ గ్రూపుల వామపక్షాలు,వాటి అనుబంధ సంస్థలు చీటికి మాటికి బంద్‌ల పిలుపునిస్తున్నాయి. ఒకరోజు భారత్ బంద్, మరో రాష్ట్రబంద్, ప్రాంతీయ బంద్, జిల్లాబంద్‌లతోపాటు రాస్తారోకో, రైల్‌రోకో వుద్యమాలు నిర్వహిస్తూ వారి వునికి కోసం ప్రాకులాడుతున్నారు. ప్రజలను కష్టాల్పాల్జేసి, ప్రభుత్వానికి నష్టం కలిగించి, పౌర జీవనం స్తంభింప జేయడం ప్రజా సంక్షేమం కోరే నాయకులకు భావ్యమా? బందులలో హింసాకాండ, ఆస్తుల ధ్వంసంచేటు చేసుకుంటున్నాయి. బంద్‌లలో చిందులు తొక్కడం రాజకీయ వాదులకు విందుగా వున్నా, ప్రజాసంక్షేమం నిందుగా వుందదన్న నగ్నసత్యాన్ని గుర్తించడం మంచిది.

ఆత్మకూరు -కె.వి.సత్యనారాయణ.

50 ఏళ్ళ క్రితం

.3 పేజీ కొరవ

మళ్ళీపెళ్ళి చేసుకున్నారు. అల్లీపురం సోమిరెడ్డివారి అమ్మాయిని 5వేలకట్నం. 15యకరాల అరణంతో యిచ్చారు. ప్రథమ భార్యకు సంతానంలేదని మళ్ళీపెళ్లా? ఆమెకూ సంతానం లేకపోతే మళ్లీపెళ్ళా?ఏమి సంఘంరా నాయనా;

తులసీరామాయణ కాల క్షేపం :- పురమందిరాన. ప్రతిసాయంత్రం సాగుతూనేవుంది. రామకథ, అందులో తులసీదాస విరచితం; దానికితోడు అప్పారావుగారి భక్తిప్రపూరిత ప్రియవక్తృత్వం. ఇక ఆస్తికులు రామకథా మృతమును దోసిళ్ళతో త్రాగవచ్చును. దశయ్య బహూకరణం రు.116లు. తిక్కవరపు పారితోషికంగూడా వుందట.

కదంబం:- నెల్లూరు ట్రంకురోడ్డు ఖద్దరు దుకాణం ప్రక్కన ఒక వ్యాపారి మద్రాసునుండి రు.130 లకు కంట్రోలు ధరకు తెచ్చిన సైకిళ్ళు రు.250లకు తక్కువలేకుండా ఆవయుకులైన రెడ్డి యువకులకు అమ్ముతున్నారట. ఓ మొద్దు అబ్బాయిల్లారా; కంట్రోలు రేటుకు సైకిళ్లు దొరుకుతుంటే యిప్పటికి కొనుగోలుచేయండి. ...వికర్మరా నాయనా;

-విమర్శకుడు.

నెల్లూరు సంగతులు

4వ పేజీ కొరవ

ప్రదర్శించారు. కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో 23 తేది వర్ధ్యావతి మహిళా గ్రంథాలయంలో అభినందన సభ ఏర్పరచి నాటకంలో నటించిన నటీనటులను, ప్రదర్శనకు సహకరించిన వారిని మెమెంటోలతో సత్కరించారు. నాటక రంగం క్షీణ దశకు చేరుకుంటున్న క్లిష్ట సమయంలో [illegible] రావు కొత్త నాటకాలు వ్రాసి, నటించి పరిషత్తులలో పాల్గొనటం మెచ్చుకో దగ్గ విషయమని వక్తలు వైద్యుల శ్రీనివాస రావు, డిసి సత్యమూర్తి, గ్రిద్దలూరు గోపాల రావు, ఉషా స్టూడియో కృష్ణమూర్తి ప్రశంసించారు. రక్త పరీక్షలు వృత్తిగా గల వవనాథ రావు అందులో తాను సంపాదించిందంతా నాటక రంగానికి ధారావత్తం చేయడం అతనికి ఆ రంగం పై వున్న మక్కువను చాటుతుంది.

దూదేకుల సంఘం మహాసభ

నెల్లూరు జిల్లా నూర్ భాషా (దూదేకుల) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా మహాసభ 23 తేది టౌన్ హాల్‌లో జరిగింది. మాజీ శాసన సభ్యులు కె.వి. సుబ్బారెడ్డి, ఏ.వి. ప్రసన్న రెడ్డి, ఉదయగిరి నరసింహులు గౌడ్, తన్నీరు కోటయ్య, నూర్ భాషా సంఘం అధ్యక్షుడు దాదాసాహెబ్ తదితరులు వేదిక పై ఆశీనులయ్యారు. కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కుల సంఘాలు ఏర్పరచు కొన్నంత మాత్రాన సరిపోదని ఆయా కులాల ప్రజల్లోని పేదరికాన్ని, అజ్ఞానాన్ని రూపు మాపాలని కోరారు. దూదేకుల కులం వారికి అనేక రిజర్వేషన్లు వున్నప్పటికీ వాటిని సద్వినియోగ పరచు కోవటం లేదన్నారు. కుల సంఘాలు ఏర్పచుకొని ఇతర కులాలను దూషించ కూడదని వెనుకబడిన తరగతుల సంఘం జిల్లా నాయకుడు నరసింహులు గౌడ్ కోరారు. సభకు రిటైర్డ్ మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.కె. మహబూబ్ అధ్యక్షత వహించారు. సభానంతరం 'ఖుద్దూస్' బృందం సత్య హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించింది.

నాటకానికి ఆంధ్రలో ఆదరణలేదు!

తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మాదిరి మన రాష్ట్రంలో ప్రేక్షకులు నాటకాలను ఆదరించక పోవడం వల్ల ఆ రంగం హీన స్థితిలో వుందని ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్ అన్నారు. 21 తేది కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన మానస సాంస్కృతిక సంస్థ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఎసిటిటి చెన్నయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలాజీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఏ.వి. ప్రసన్న రెడ్డి కూడా పాల్గొన్నారు. సంస్థ కార్యదర్శి జి.టి.కె. మూర్తి తన సంస్థ ఆశయాలను తెలియజేస్తూ పలు రంగాలలో నిష్ణాతులైన కళాకారులకు ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం అందజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఆ సహాయాన్ని మేకప్ ఆర్టిస్ట్ గోవిందుకు అందజేశారు. సభకు ముందు బాలరాజా మిమిక్రీ, సభానంతరం 'ఇది నాటకం కాదు' ప్రదర్శన సభికులను ఆకట్టు కొన్నాయి. సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీమతి డి. వసుంధరాదేవి కార్యక్రమానికి వాఖ్యాతగా వ్యవహరించారు.

పసిడి పలుకునకు పసిడి పండుగ *

'రసిక'

అయిదు పదుల వెనుక యైన్‌స్టీను మేధావి
[illegible] మేటి శాస్త్రవేత్త
'బాపూజీని' కలిసి, భాషించి, ముగ్ధుడై
పసిడి తునక [illegible] పలుకు పలికె +
''ఇట్టి మర్త్యుడొకండు మహితలాన
రక్తమాంసముల్ కలశరీరమ్ము [illegible]
నడచెనే?! నిక్కమేయిది, నమ్మతరమా?!
అని తలంతురు ముందు తరాలవారు''
సత్యము పసికట్టి సాకల్యముగ జూచి
సత్యశోధకుండు, సాధకుండు,
అట్టి శాస్త్రవేత అన్నదసత్యమా?
నమ్మకుండాలెట్లు? నమ్ముటెట్లు?

* Golden Jubilee of a Golden saying

\+ The Hindu dated oct 1, 1944.

ఎల్.ఐ.సి. డబుల్ కోటీశ్వరుడు

వాస్తవంగా కోటి రూపాయలు మన వద్ద లేక పోయినా, ఎల్ఐసి ఏజంటుగా చేరి కోటి రూపాయల విలువ చేసే పాలసీలు కట్టిస్తే ఎల్.ఐ.సి. కోటీశ్వరుడు కావచ్చు. ఎంచక్కా 'ఏజెంటు రత్న' బిరుదు పొందవచ్చు. ఈసారి ఈ అవార్డును నెల్లూరు సిటీ బ్రాంచిలోని కొల్లా హరనాథ రావు కోటి 50 లక్షల వ్యాపారం సాధించి పొందినట్లు బ్రాంచి మేనేజర్ పి. సాంబశివ రావు పత్రికల వారికి చెప్పారు. సిటీ బ్రాంచి గత ఆరున్నర నెలల్లో 11 కోట్ల 66 లక్షల 77 వేల వ్యాపారం చేసిందట. 93 - 94 సంవత్సరానికి 29.5 కోట్లు బ్రాంచి లక్ష్యం కాగా ఇప్పటికి 39 శాతం వ్యాపారాన్ని పూర్తి చేసినట్లు వివరించారు. ఎల్.ఐ.సి. కోటీశ్వరుడుగా గత సంవత్సరపు అవార్డును హరినాథ రావు ఈ సంవత్సరం కూడా నిలబెట్టుకొని డబుల్ కోటీశ్వరుడు అయినట్లు చెప్పారాయన.

ఎన్నికల సభలకు పోలీసుల ప్రచారం

జరగబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా అక్టోబర్ 25 తేది నుండి డిసెంబర్ 10 లోగా టౌన్ డిఎస్పీ అనుమతి లేనిదే ఎటువంటి వూరేగింపులు, బహిరంగ సభలు టౌన్‌లో ఏర్పాటు చేయకూడదు. శాంతి భద్రతల దృష్ట్యా ఎన్నికల కమీషనర్ ఆదేశాను సారం ఈ చర్య తీసుకొన్నట్లు పోలీసులు 23 తేది నుండి టౌన్‌లో తమ శాఖ జీపుల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

సీనియర్ సిటిజెన్స్ కౌన్సిల్

శిరోమణి నగర్, గాయత్రి నగర్, పోలీసు కాలనీ, రెవిన్యూ కాలనీ ప్రాంతాలకు సీనియర్ సిటిజెన్స్ కౌన్సిల్ ఎన్నుకొనేందుకు 23 తేది విశ్వభారతి అంధుల పాఠశాలలో సమావేశం జరిగింది. జిల్లా రిటైర్డ్ వుద్యోగుల సంఘం అధ్యక్షుడు కె. విశ్వప్రూదారి అధ్యక్షతన వివిధ సమస్యల పై చర్చించి వాటి పరిష్కారానికి కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షునిగా పి. జితేంద్ర నాథ్ బాబు, ఉపాధ్యక్షునిగా ఐవిఎన్ నాయుడు, కార్యదర్శిగా పసుపులేటి వెంకట సుబ్బయ్య, సహకార్యదర్శిగా డి. వీరాస్వామి, కోశాధికారిగా సి.వి. కృష్ణారెడ్డిలతో పాటు మరో 5 గురు కార్యవర్గ సభ్యులు వీరిలో వున్నారు.

సమస్యల పరిష్కారానికి వార్డుల వారీగా కమిటీలు

ఇటీవలే పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమింప బడ్డ నిజమైన కాంగ్రెస్ కార్యకర్త పందిళ్లపల్లి అరుణమ్మ 26 తేది తొలిసారిగా పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసి తన మనోభావాలు వెల్లడించారు. టౌన్‌లో పార్టీని పటిష్ట పర్చే చర్యలో భాగంగా ప్రతి వార్డు నుండి ఐదుగురు సభ్యులను తీసుకొని ఒక కమిటీగా వేస్తుందట. వీరు స్థానికంగా వుండే సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుక వస్తే వాటి పరిష్కారానికి జిల్లా అధికారుల వద్దకు వెళ్లే కార్యక్రమం రూపొందించు కొంది అరుణమ్మ. ఇక ఆమెకు చేతి నిండా పనే. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో మొత్తం 11స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచు కొంటుందని, దాని కోసం ఎవరు పిలిచినా వెళ్ళి ప్రచారం నిర్వహిస్తా నంటుంది. 1978 నుండి పార్టీలో వున్నా ఏనాడూ పదవి ఆశించి పని చేయలేదని, తన కృషిని గుర్తించి పార్టీ పదవి ఇచ్చినా నిరంతరం సామాన్య కార్యకర్తగానే పనిచేస్తానని చెప్పిందామె. జిల్లాలో పోటీ చేసి గెలవగల సత్తావున్న మహిళను గుర్తించి పార్టీ టిక్కెట్లు ఇవ్వాలని కోరుతూ, తనకన్నా సీనియర్ మహిళా కార్యకర్తలు చాలామంది పార్టీలో వున్నట్లు చెప్పారు. తాను కౌన్సిలర్‌గా పరాజయం పాలైన విజయమహల్ వద్ద బాక్స్‌టైపు డ్రైన్ పోరాటంతో పాటు పలువురికి రుణాలు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయించడానికి కృషి చేసినట్లు చెప్పుకొన్నారామె. పంచాయితీ రాజ్ ఎంప్లాయీస్ జాయింట్ కన్వీనర్ శ్రీమతి సరోజనమ్మ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

చిత్రసమీక్ష
9 పేజీ కొరవ

చెల్లెల్ని పెళ్ళి చేసుకో మంటాడు. కాదనడంతో ప్రతీకారంగా తన భార్యకు విడాకు లిస్తానంటాడు. కోర్టుల కెక్కుతాడు. చివరన ప్రతాప్ విశ్వనాథం బృందంతో ఫైటింగులు. ప్రతాప్ గెలుపొందడం ఈ విధంగా కథ ప్రధాన అంశాన్ని వదలి అటూ ఇటూ దారితప్పినడిచింది. దీనివల్ల ఒక ధ్యేయంతో సృష్టించబడ్డ ప్రతాప్ పాత్ర కూడా కొంత వరకు దెబ్బతిన్నది. కృష్ణ ఈ పాత్రను చాలా వరకు తన నటనతో నిలబెట్టగలిగాడు. డాన్సులు చెయ్యడంలోను, ఫైటింగులు చెయ్యడంలోను మెరుగ్గా కనిపించాడు. ఈ డాన్సులు, ఫైటింగులు హీరో ఇమేజ్‌ని పెంచితే పెంచవచ్చుగాని, చిత్రాన్ని రక్తికట్టించలేదు. బిగువైన కథ, అర్థవంతమైన పాత్రలే చిత్రాన్ని [illegible] కట్టించగలవు. ఈ నగ్న సత్యం ఈ చిత్రంలోనూ రుజువైంది.

కథ చప్పగా వున్నా దర్శకుడు కథనంలోనైనా చురుకుదనం చూపలేక పోయాడు. సన్నివేశాలు, కోర్టు సీనులు, విశ్వనాథం కొడుకు తప్పతాగి పేవ్‌మెంట్ మీద నిద్రపోతున్న పేదవారిపై కారెక్కించి చంపే దృశ్యాలు ఒకటేమిటి అన్నీ చప్పగా వున్నాయి.

అప్పలాచార్య మాటలు, జొన్నవిత్తుల, భువనచంద్ర వ్రాసిన పాటలు మరీ చప్పగా వున్నాయని చెప్పక తప్పడంలేదు. వాసూరావు సంగీతం పరమబోర్. రాంప్రసాద్ ఫోటో గ్రఫీ సాదాసీదాగా వుంది.

''అల్లరి పాండవులు'' చిత్రం తర్వాత చాలా కాలానికి బాలయ్య దర్శకత్వం వహించిన రెండవ చిత్రమిది. నటుడుగా ఎలాగూ వెనకబడి పోయాడు. తన అసమర్థత వల్ల ఈ చిత్రంతో దర్శకత్వంలోనూ మరింత వెనక బడిపోయాడు.

ఈ చిత్రాన్ని కేవలం కృష్ణ డాన్సులు, ఫైటింగులు చూడముచ్చట పడ్డా, అది మూడు రోజుల ముచ్చటగా ముగుస్తుంది.

సినిమా
9వ పేజీ కొరవ

ఎన్నో చిత్రాలకు హిట్ సాంగ్స్ ఇచ్చారు. అభిప్రాయబేధాలవల్ల ఇటీవల వీరిద్దరూ విడిపోయారు. ఇద్దర్నీ కలపడానికి కొందరు సినీ ప్రముఖులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇటుపైన ఇద్దరూ విడివిడిగా చిత్రాలకు సంగీతమిస్తారు.

దాదాపు 30 ఏళ్ళ క్రితం విడిపోయిన సంగీత దర్శకద్వయం విశ్వనాథం-రామమూర్తి ఇటీవల మళ్లీ మిత్రులయ్యారు. ఇద్దరూ కలిసి కొత్తగా కొన్ని తమిళ చిత్రాలకు సంగీతమిస్తున్నారు.

చాలా బిజీగా వున్న సరిత

చాలా రోజుల తర్వాత ఒక డబ్బింగ్ థియేటర్‌లో కనిపించిన సరితను ''ఈ మధ్య మీరెక్కడా కనిపించడంలేదే?'' అని అడిగితే ''ఇదివరకటి కన్నా చాలా బిజీగా వున్నానండి.'' అంది. ఏ ఏ చిత్రాలలో యాక్ట్ చేస్తున్నారు? అని అడిగితే . తెరవెనుక నేను ఎంతో బిజీగా వున్నాను. ఉత్తరాది నుంచి మన దర్శక నిర్మాతలు దిగుమతి చేసుకుంటున్న నగ్మా వంటి తారలకు డబ్బింగ్ చెప్పేది నేనే కదా! అంది. తమిళ చిత్రాలలో పలు హిందీ తారలకు డబ్బింగ్ చెప్తోన్న మరో నటి రోహిణి త్వరలోనే ఒక తమిళ టెలీ సీరియల్‌కు స్క్రిప్టు రాసి, దర్శకత్వం వహించ బోతోంది కూడా.

ముఖ్యప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయడమేమనగా నాకు యిదివరలో జనరల్ పవర్ ఆఫ్ అటర్నీగా వ్యవహరించుచుండిన, గూడూరు నరశింగరావుపేట కాపు రస్థుడు చెంచురెడ్డి కుమారుడు దుగ్గిరాల జయరామిరెడ్డి, నా [illegible] వ్యతిరేకమైన చర్యలు చెయుచూ వ్యవహరించిన కారణము వలన అతనిని వకీలు నోటీసు మూలకముగా తొలగించుటకు [illegible] (Document No.609/W/91 dt. 19-6-91) ద్వారా యిదివరలో యిచ్చిన పవర్ఆఫ్ అటార్నీని రద్దుచేయుచూ, హైదరాబాదు చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రారువారి కార్యాలయములో డాక్యుమెంటు నం 1203/94 dt. 19-9-94 పత్రము ద్వారా తొలగించి నందున, సదరు జయరామిరెడ్డి 19-9-94 వ తేది నుండి నా తరపున పవర్ఆఫ్ అటార్నీగా వ్యవహరించుటకు హక్కు లేదని తెలియజేయడమైనది. ఇందుకు భిన్నముగా ఆయన నా తరపున వ్యవహరించి చేసిన, మరియు చేయు చర్యలకు నేను భాధ్యురాలను కాను.

ఇట్లు

కేతిరెడ్డి సుజాతమ్మ

W/o.Late K.C.Reddy.

లక్ష్మిపార్వతి పాదుకా పట్టాభిషేకం

ఎన్నికల రణరంగంలో తెలుగుదేశం పార్టీ అందరికంటే ముందుగా సమర శంఖారావం పూరించింది. ఎన్టీఆర్ చాలా జోరుగా వున్నారు. ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. ప్రజా గర్జన దిగ్విజయం అయిన్ను కలల లోకంలో విహరింప జేస్తున్నది. ప్రజలు తనకు అండగా వున్నారని, తనను ఆదరించనున్నారని, తాను మళ్ళీ అధికారంలోకి రాబోతున్నానని భావిస్తూ, వూహిస్తూ, పోలింగ్ ఎప్పుడెప్పుడు జరుగుతుందా అని వువ్విళ్లూరుతున్నారాయన. దీనికి విరుదలలో జాప్యానికి కారణం. సీటు సీటు దగ్గరా పేచీ పెడుతున్నారామె. అల్లుళ్లకు ఎటూ తోచడం లేదు. ఎన్టీఆర్ మొగ్గు కొత్త భార్యవైపే వుంది. ఎంతైనా ముసలి వయస్సులో పడచు పెళ్ళాంకదా! ఈ మోజు ఎంత దూరం వెళ్ళిందంటే తన తర్వాత లక్ష్మిపార్వతిని ముఖ్యమంత్రిగా చేయడానికి తనకేమీ అభ్యంతరం లేదని, తన భార్యగా ఆమెకా అర్హత వుందని ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు రామారావుగారు. అల్లుళ్ల నిర్ధారిసేకా.

> ఎన్టీఆర్‌ను బొమ్మగాపెట్టి పగ్గాలు తన చేతిలోకి తీసుకోవడంలో లక్ష్మిపార్వతి విజయురాలైంది; ఆమెను ముఖ్యమంత్రిని చేయడానికి తాను రెడీ అని ప్రకటించి రామారావు గారు సతిభక్తి చాటుకున్నారు!

తగ్గట్లే ప్రచారారంభంగా తిరుపతిలో చైతన్యరథమెక్కితే జనం విరగబడి రావడం, 1983 నాటి వాతావరణం స్ఫురించడం ఎన్టీఆర్ ఆత్మవిశ్వాసాన్ని మరీ పెంచింది. ఒకటి రెండు రోజులలో అభ్యర్థుల నిర్ణయం పూర్తిచేసి, తుది జాబితా విడుదల చేసి రాష్ట్రమంతా రివ్వున తిరిగేయాలని, తలపోస్తున్నారు. చైతన్యరథంతో పాటు, ఒక హెలికాప్టర్‌ను కూడా అద్దెకు తీసుకొనే ప్రతిపాదన పరిశీలనలో వుంది.

అయితే ప్రజాదరణ పెంపొందింప జేసుకోవడంలో సఫలీకృతుడైనంతగా, ఇంటి రచ్చలు చక్కబెట్టుకోవడంలో ఎన్టీఆర్ నేర్పరితనం ప్రదర్శించలేక పోతున్నాడు. కొత్త భార్య, పాత అల్లుళ్ల మధ్య సర్దుబాటు కుదరడం లేదు. లక్ష్మిపార్వతి చాలా జోరుగా వుంది. పార్టీలో తానే కథానాయికనని, అల్లుళ్లు మట్టిబొమ్మలు మాత్రమేనని నిరూపించడంలో నిమగ్నురాలై వుందామె. ఈ ఇంటి పోరే - అభ్యర్థుల తుది జాబితా

మొత్తం పార్టీ నాయకులను, కార్యకర్తలను అయోమయంలోకి నెట్టిందీ ప్రకటన. ఆమెను తన వారసురాలిగా నిర్ణయించి, ప్రోత్సహిస్తే తమ పరిస్థితేమిటని వాపోతున్నారు అల్లుళ్ళిద్దరూ. టిక్కెట్ల పంపకంలో దీనికి తగ్గట్లే ఎన్టీఆర్ లక్ష్మిపార్వతి మాటకు విలువ నిస్తున్నారు. జాబితాలు తయారుచేసేటప్పుడు మొగుడు, పెళ్లాలు మాత్రమే గదిలో కూర్చుని, తలుపులేసుకుంటున్నారు. వాకిట్లో తారాడడమే అల్లుళ్ల గతి అయ్యింది. కాని ఈ దశలో మామతో పేచీ పెట్టుకునే పరిస్థితి కాదు వారిది. అలిగి మూల కూర్చుంటే లక్ష్మిపార్వతి పేర్లు వ్రాసేస్తుంది. ఆ తర్వాత అవసరం వచ్చినప్పుడు తమకంటూ మనుషులు మిగలరు. అందువల్ల ఆత్మాభిమానం చంపుకొని, అవమానాలు మనసులోనే దిగమ్రింగుకొని, అత్తా మామల సేవచేస్తున్నారు వారు. నయానో, భయానో తమ తమ అనుచరులకు టిక్కెట్లిప్పించుకొని, గెల్పించుకొంటే ఆ తర్వాత క్లిష్టపరిస్థితులేర్పడినప్పుడు తమ కంటూ ఒక వర్గం వుంటుందన్నది వీరి ఆలోచన.

కాని టిక్కెట్ల కోసం జిల్లాలనుంచి వస్తున్నవారికి అంత ఓర్పు, ఓపిక వుండడంలేదు. ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా; అత్తా అల్లుళ్ల ఇంటి పోరు దృష్ట్యాకూడా ఆయన టిక్కెట్లిచ్చే సందర్భం ఇదే చివరిది కావచ్చునని; ఎన్టీఆర్ లేకుంటే తెలుగుదేశం పార్టీ కూడా వుండదు కాబట్టి ఇప్పుడే అమితుమీ తేల్చుకోవాలనే అసహనభావం వారిలో ప్రబలంగా కన్పిస్తున్నది. అందువల్లే తమకు టిక్కెటిచ్చి తీరాలని చాలా పెడసరంగా ప్రవర్తిస్తున్నారు జిల్లా నాయకులు. టికెట్ రానివారు జనాన్ని తోలుక వచ్చి బెదరిస్తున్నారు; అసభ్యంగా తిడుతున్నారు; తిరుగుబాట్లు ప్రకటిస్తున్నారు. ఒక్కొక్క రోజు వీరి వత్తిడి, తిట్లు భరించలేక ఎన్టీఆర్ లోపలకు వెళ్ళిపోయి తలుపులేసుకోవలసి వస్తున్నది. ఒక విధంగా ఇది ఎన్టీఆర్ చేసిన పొరపాటే. ప్రతి నియోజక వర్గంలో నలుగురైదుగురికి టిక్కెట్లిస్తానని ఆశ పెట్టారాయన. ప్రజా గర్జన సదస్సు విజయవంతం చేయడం కోసం, తనను కలవడానికి వచ్చిన వారందరికీ టికెట్ మీదేననే అర్థం వచ్చేటట్లు మాట్లాడారు. కొందర్ని ప్రచారం కూడా చేసుకోమన్నారు. ఆ మాటలు నమ్మి, లక్షల ఖర్చుతో జనాన్ని తోలుక వచ్చిన వారంతా ఇప్పుడు ఆశాభంగం తట్టుకోలేక ఆవేశ పడిపోతున్నారు.

ఇదిట్లా వుంటే లక్ష్మిపార్వతి పరిస్థితి వేరుగా వుంది. ఆమె చాలా దూరదృష్టితో ఆలోచిస్తున్నారు. ఎన్టీఆర్ ఇప్పుడామె మాట కాదనే పరిస్థితిలో లేరు. ఆమె చెప్పిందే వేదం. ఆమె లేకుండా ప్రచారానికి పరిస్థితి లేదు. ఆమె సమక్షంలో తప్ప కనీసం అల్లుళ్లతో కూడా రాజకీయాలు మాట్లాడే సాహసం కూడా చేయడం లేదు. లక్ష్మిపార్వతి కి తిప్పితే కదిలే బొమ్మ ఆయనిప్పుడు. ఆమెకు కావలసిందీ అదే. పార్టీలో తన మనుషులంటూ మెజారిటీ శాసనసభ్యులను ఎంపిక చేసుకొని; ఎన్టీఆర్‌ను ముందు నిలబెట్టి; వెనుకనుంచి పగ్గాలు పట్టుకోవాలన్నది ఆమె సంకల్పం. భరతుడు రాముని పాదుకలతో రాజ్యం చేసినట్లు, అనారోగ్య పీడితుడైన రామారావును సింహాసనంపై కూర్చుండబెట్టి చక్రం తిప్పాలన్నది ఆమె ఆలోచన. ఈ పాదుకా పట్టాభిషేకం కోసమే ఆమె అంత తీవ్రంగా టిక్కెట్ల విషయంలో పట్టుబడుతున్నది. అల్లుళ్లను మరి నమ్మే ... ఇష్టపడారట. ఎన్టీఆర్ ... ఆ మాట వచ్చినట్లు ప్రచారం జరిగితే, ప్రజల దృష్టికి వెళ్తే, రేపు అవసర సమయంలో వారసురాలిగా

అనర్హురాలివని వచ్చే అభ్యంతరాలను త్రిప్పికొట్టవచ్చుకదా! చాలా లోతైన, దూరపు చూపు కల్గిన ఆలోచనలు ఆమెవి!

అల్లుళ్లతోపాటు పార్టీలోని ఏ నాయకుడు కూడా ఇప్పుడు ఎదిరిస్తున్నది. ఎన్టీఆర్ ప్రతికుండగానే పార్టీపైన, ప్రభుత్వంపైన అదుపు సంపాదిస్తే తప్ప ఆ తర్వాత తనకు ఛాన్సు ఇవ్వరన్నది ఆమె భయం. అందువల్లే ఎన్టీఆర్ చేత- లక్ష్మిపార్వతి ముఖ్యమంత్రి అయ్యేందుకు తనకు అభ్యంతరం లేదని ప్రత్యేకంగా చెప్పించిందామె. ఆ దినపత్రిక విలేఖరి ఆ ప్రశ్న అడిగినపుడు ఎన్టీఆర్ తటపటాయిస్తే ఆమె కోక్యం చేసుకుని

లక్ష్మిపార్వతి స్పీడుకు బ్రేక్ వేసే పరిస్థితిలో లేరు; అట్లని ఆమెను సహించే మానసిక స్థితి లేదు. నాలుగవ జాబితాలో తమకు పూర్తి అన్యాయం జరిగితే, వెంటనే ఏదో ఒక రూపంలో ప్రతిస్పందించాలన్నది వీరి తలంపు. ఆ ప్రతి స్పందన తిర్శుగుబాటు రూపంలో వుండవచ్చు; లేదా వట్టి తిట్లతో సరిపెట్టుకోవచ్చు.

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. OFFSET Printing at Nayagara Paper Products (India) Ltd.,